విశాఖపట్టణం
శుక్రవారం 22 మే 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in  సంపుటి: 9  సంచిక: 118  వెల: రూ.5/-  పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ఎండ... ప్రచండం..!

**రోళ్లు పగిలేలా ఉష్ణోగ్రతలు**

**నిప్పుల కొలిమిలా రాష్ట్రం**

**పిడుగురాళ్లలో 48.1 డిగ్రీలు**

**18 జిల్లాల్లో 45 దాటిన తీవ్రత**



6

# చంద్రబాబుకు ఇవే చివర ఎన్నికలు

**నాన్న మృతిపై చాలా అనుమానాలున్నాయి**

**అప్పట్లో వైఎస్ అసెంబ్లీకి ఎలా వస్తారో చూస్తాం అనలేదా**

**ఎవరిది గన్ కల్చర్.. బాలకృష్ణ గన్ తో టపా టపామని కాల్చలేదా**

**ఎన్టీఆర్ కుమార్తెను ఇస్తే పార్టీని, గుర్తును చంద్రబాబు లాక్కోలేదా**

(తాడేపల్లి - జయజయహే)

"మా కుటుంబంలో ముగ్గురు మా తాత, మా నాన్న, చిన్నాన్న ముగ్గురు బలైపోయారు. మేం బాధితులం. కానీ మా పైనే తప్పుడు రాజకీయాలు చంద్రబాబు చేయిస్తున్నారు. రాజారెడ్డిని చెప్పిందెవరు? టీడీపీ వాళ్లు కాదా, ఈ ఘటన చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు జరగలేదా అని అడుగుతున్నాను. 1999 అసెంబ్లీ ఎన్నికల ముందు రాజారెడ్డిని చంపేశారు. కేవలం రాజశేఖర్‌ను పులివెందులకే కట్టడి చేయాలని, రాజకీయ కోణంతో ఈ పని చేశారు. ఆ కేసులో దోషులను బరితెగించి హైదరాబాద్ టీడీపీ ఆఫీస్‌లో పెట్టి అధికార దుర్వినియోగం చేసి రక్షించారు. ఎవరిది క్రిమినల్ బ్రెయిన్ అని చంద్రబాబును అడుగుతున్నాను. అని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మా నాన్న విషయంలోనూ అంతే, చనిపోక ముందే అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తా అన్నారు. రెండు మూడు రోజులకే రాజశేఖర్ రెడ్డి చనిపోయారు. ఇప్పటికీ ఎన్నో అనుమానాలు ఉన్నాయి. ఎవరిదీ హత్యా రాజకీయాలు చంద్రబాబు. వివేకానంద రెడ్డి ఇదే చంద్రబాబు ప్రభుత్వంలో హత్యకు గురయ్యారు. వైసీపీ కోసం అవినాష్ రెడ్డి కోసం ప్రచారం చేసి వచ్చారు. తానే చంపినట్టు చెలరేగిపోయి మాట్లాడిన దస్తగిరి అనే వ్యక్తి ఇవాళ స్వేచ్ఛగా పోలీసుల సెక్యూరిటీలో కారులో తిరుగుతున్నారు. చంద్రబాబు లాయర్, దస్తగిరి లాయర్ కూడా ..మిగతా 2లో





## స్త్రీ శక్తి థీమ్!

**మహిళా సాధికారతకు మహానాడులో ప్రాధాన్యత**

**మొత్తంగా 20 తీర్మానాలు ఖరారు చేసిన పొలిట్ బ్యూరో**

**తెలంగాణకు 4,అండమాన్ కు 1, పలు రాజకీయ తీర్మానాలు**

**క్లస్టర్ ల వారీ ఎన్టీఆర్ వర్థంతి నిర్వహించాలని బాబు పిలుపు**

(అమరావతి - జయజయహే)

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం గురువారం మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం, పొలిట్‌బ్యూరో నియామకం తర్వాత తొలిసారి ఈ భేటీ జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్‌గా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ భేటీలో మహానాడు నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహానాడు వేదికగా చేపట్టాల్సిన తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై విస్తృతంగా చర్చించారు. ఈసారి మహానాడులో మొత్తం 20 కీలక తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 10 తీర్మానాలు, ..మిగతా 2లో

## ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేయాలి

**సెప్టెంబర్ నెలాఖరు టార్గెట్ గా పెట్టుకోవాలి**

**విశాఖ భాగస్వామ్య సదస్సు ఎంఓయూలు ముందుకు**

**క్షేత్రస్థాయిలో 114 ప్రాజెక్టులు పనులు**

**సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు**

**ఎస్ ఐపీబీ ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో సమీక్ష**

(అమరావతి - జయజయహే)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై కీలక సమీక్షా సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు, అలాగే ఎస్ఐపీబీ ..మిగతా 2లో



## విశాఖలో ఎలక్ట్రిక్ రాపిడ్ ట్రాన్సిట్

**బీఆర్టీఎస్ రోడ్డులో ఏర్పాటుకు కసరత్తు**

**ఆసక్తి చూపుతున్న హెస్ గ్రీన్ మొబిలిటీ సంస్థ**

(విశాఖపట్నం - జయజయహే)




మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం నగరంలోని బి.ఆర్.టి.ఎస్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ మరియు ప్రజా రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా ఎలక్ట్రిక్ రాపిడ్ ట్రాన్సిట్ (ఈ- ఆర్టీ) వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి వి సత్యనారాయణ రాజు , చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకర్ రావు,ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ..మిగతా 2లో



## 30 మంది మంత్రులు అవుట్..?

**ప్రక్షాళన దిశగా కేంద్ర క్యాబినెట్**

**పార్టీ సేవలకు పలువురు సీనియర్లు**

**నితీశ్ కుమార్, అన్నామలైకు చోటు**

**కసరత్తు చేస్తున్న అధిష్టానం**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్ర క్యాబినెట్ లో మార్పులు చేర్పులు అనే ఊహాగానాలు ఉత్కంఠ రేపుతున్నాయి. భాగస్వామ్య పక్షాలను క్యాబినెట్ లోకి తీసుకునే ఛాన్స్ ఉంది. దాదాపు 30 మంది మంత్రులను పార్టీ సేవలకు పంపే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. నితీశ్ కుమార్, అన్నామలైకి మంత్రి పదవులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆప్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఎంపీలకు బెర్తులు ఇస్తారా? అనేది ..మిగతా 2లో

## కాక్‌రోచ్ జనతా పార్టీ సంచలనం

**ఐదు రోజుల్లో 5.6 మిలియన్ల ఫాలోవర్లు**

**లక్షకు పైగా సబ్ స్క్రైబర్లు సొంతం.. జోతిష్య గణనతో యువతలో ఆసక్తి**




(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

2026 మే 16వ తేదీ రాత్రి 11:37 గంటలకు న్యూఢిల్లీలో ఒక విచిత్రమైన పార్టీ పుట్టింది. కార్యాలయం లేదు, జెండా లేదు, ఎన్నికల గుర్తు లేదు, కేవలం ఒక పోస్ట్-ఇట్ X గుర్తు, ఒక గూగుల్ ఫారంతో దానికి బొద్దింక జనతా పార్టీ అని పేరు పెట్టారు. కేవలం ఐదు రోజుల్లోనే, ఇది 5.6 మిలియన్ల మంది ఫాలోవర్లను, లక్షకు పైగా సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుంది. మహువా మోయిత్రా నుంచి ..మిగతా 2లో

## కొత్త ప్రభుత్వాల్లో ఏఐ శాఖలు

**కేరళ, తమిళనాడు సీఎంల నిర్ణయం**

**కేవలం ఐటీకి పరిమితం కాకుండా ఏఐపై దృష్టి**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేరళ, తమిళనాడుల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. కేరళ సీఎం సతీశన్, తమిళనాడు సీఎం విజయ్ సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో, కేవలం ఐటీ శాఖకు పరిమితం కాకుండా ఏఐ కోసం ప్రత్యేక పోర్ట్‌ఫోలియోను కేటాయించడం ద్వారా తమ దూరదృష్టిని చాటుకున్నారు. తమిళనాడు మంత్రివర్గ విస్తరమలో వేళచ్చేరి నియోజకవర్గ ప్రతినిధి కుమార్‌కు ఈ బాధ్యతలు ..మిగతా 2లో



For a pure tomorrow.. జయహో

# ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేయాలి




**మొదటి పేజీ తరువాయి...**

ద్వారా ఆమోదం పొందిన ప్రాజెక్టుల అమలుపై మంత్రుల కమిటీతో సీఎం సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ.. ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబుకి వివరాలు అందించింది. ఇప్పటివరకు ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో మొత్తం 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి ఇవి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల్లో ఇప్పటికే 114 ప్రాజెక్టులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయని, వాటి ద్వారా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని లోకేశ్ వివరించారు. పెట్టుబడిదారులతో కుదిరిన ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఎంఓయూలకు సంబంధించిన ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు మంజూరు చేయాలని, అవసరమైన భూ కేటాయింపులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ దశకు చేరి పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మాత్రమే కాకుండా, అవి వేగంగా అమలై యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా ఆయా ప్రాజెక్టుల గ్రౌండింగ్ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 2028 చివరి నాటికి ఆయా ప్రాజెక్టులు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని మార్గనిర్దేశం చేశారు. ఈ మేరకు మంత్రుల కమిటీ, అధికారులకు లక్ష్యం నిర్దేశించారు. పెట్టుబడిదారులకు సింగిల్ పోర్టల్ ద్వారా సేవలు అందజేయాలని సూచించారు. భూ కేటాయింపుల్లో పర్యాటక ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించారు. గోవా ప్లస్‌గా సూర్యలంక బీచ్ - త్వరలో బాపట్ల మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. 23 నెలల్లో ఏపీకి 756 ప్రాజెక్టులు, రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రస్తావించారు. రాష్ట్ర యువతకు 21.20 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎంఓయూలు, ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

## చంద్రబాబుకు ఇవే చివర ఎన్నికలు

**మొదటి పేజీ తరువాయి...**

ఒక్కరే. రాజకీయ లబ్ధి కోసం ప్రలోభాలతో హంతకులను రక్షిస్తున్నారు అని జగన్ ఆరోపించారు. చంద్రబాబు బావమరిది బాలకృష్ణ గన్ పట్టుకొని ఇద్దర్ని కాల్చిపడేయలేదా. ఎవరిది గన్ కల్చర్ అని అడుగుతున్నాను. ఆ తర్వాత సాక్ష్యం ఉండకూడదని ఆ ఇంట్లో ఉన్న వాచ్‌మెన్‌ను బండరాయితో కొట్టి చంపేశారు. హరికృష్ణ ప్రమాదంలో చనిపోతే పరామర్శకు వెళ్లి కేటీఆర్‌తో పొత్తులపై చంద్రబాబు మాట్లాడారు. ఎవరిది శవ రాజకీయాలు. కూతురును ఇచ్చి రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన పార్టీని గుర్తును లాక్కొని చనిపోయేలా చేసింది ఎవరని అడుగుతున్నాను. వంగవీటి మోహన్ రంగా ఎలా చనిపోయారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిరాహార దీక్ష చేస్తుంటే అర్ధరాత్రి నరికి చంపారు. ఈ ఘటనలో వేళ్లు అన్నీ కూడా చంద్రబాబు వైపే చూస్తున్నాయి. హరిరామజోగయ్య ఏకంగా పుస్తకం రాశారు. ఆ హత్యకేసులో ప్రధాన నిందితుడు వెలగపూడి రామకృష్ణ నేటికీ టీడీపీ ఎమ్మెల్యేనే అని జగన్ మండిపడ్డారు. ఎన్టీఆర్‌పై దాడి చేసిన కేసులో మల్లెల బాబ్జీని పోలీసులు అరెస్టు చేశారు. ఆయన కొన్ని రోజులకే డెడ్‌బాడీగా మారాడు. ఆయన జేబులో లెటర్ దొరికింది. మూడు లక్షలు ఇస్తానని చెప్పారని ఉందని ఆ డబ్బులు ఇచ్చింది ఎవరు అనే విషయంపై దర్యాప్తు లేదు. ఈ కేసులో వేళ్లన్నీ అప్పట్లో చంద్రబాబు వైపే చూపించాయి. పింగళి దశరథ్‌రామ్ అనే జర్నలిస్ట్‌ను కత్తులతో దాడి చేసి చంపారు. ఈ ఘటనలో చంద్రబాబు వైపే వేళ్లని చూపించాయి.' అని విమర్శించారు.

## కాక్‌రోచ్ జనతా పార్టీ సంచలనం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రశాంత్ భూషణ్ వరకు అందరూ దీనికి మద్దతు ఇచ్చారు. ఆ తర్వాత, మే 21న, భారతదేశంలోని ఠ నెట్‌వర్క్‌లో దాని ఖాతాను ప్రభుత్వం మూసివేసింది. కానీ అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం దాని జ్యోతిష్య చార్టులో ఉంది. బొద్దింక జనతా పార్టీ జాతకం దాని గతం, వర్తమానం , భవిష్యత్తు గురించి సూచనలను అందిస్తోంది, ఇవి రాబోయే రోజుల్లో తీవ్ర చర్చనీయాంశం కానున్నాయి. ఈ పార్టీ జాతకాన్ని ఇక్కడ మొదటిసారిగా విశ్లేషిస్తున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ ఒక ప్రకటనలో నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చారు. ఆ మరుసటి రోజే, బోస్టన్ యూనివర్సిటీ విద్యార్థి, ఆప్ మాజీ సోషల్ మీడియా వ్యూహకర్త అయిన 30 ఏళ్ల అభిజీత్ దీపక్, ఠలో ఇలా రాశారు: బయట ఉన్న బొద్దింకలందరి కోసం ఒక కొత్త వేదికను ప్రారంభిస్తున్నాం. అక్కడే ఒక డిజిటల్ తుఫాను మొదలైంది. ఆ పార్టీ పేరు అందరి నోళ్లలో నానుతోంది, ప్రతి వీధి మూలలో, టీ-కాఫీ షాపులో, కేఫ్‌లో దాని గురించే చర్చ జరుగుతోంది. జ్యోతిష్య గణనలు కూడా ఆశ్చర్యకరమైన ఆధారాలను అందిస్తున్నాయి. పార్టీ జాతకం మే 16, 2026, రాత్రి 10:37 గంటలకు (న్యూ ఢిల్లీ) నాటిది. పార్టీ అధికారిక వెబ్‌సైట్ మే 17, 2026న ప్రారంభించినప్పటికీ, మొదటి పోస్ట్ అదే సమయంలో ఠలో పోస్ట్ చేశారు. ఈ మొదటి పోస్ట్ ఆధారంగా చేసిన జ్యోతిష్య గణనలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి: ఆ కాలపు జాతకంలో, లగ్నం మకరం , రాశి వృషభం, ఇందులో చంద్రుడు ఉచ్ఛస్థితిలో ఉన్నాడు. జ్యోతిష్య శాస్త్రంలో, చంద్రుడు వృషభ రాశిలో ఉన్నప్పుడు, అది అత్యంత బలమైన లేదా ఉచ్ఛస్థితిలో ఉంటుంది. దీని అర్థం ప్రజలతో అసాధారణమైన , లోతైన అనుబంధం ఏర్పడటం. కేవలం ఐదు రోజుల్లో 56 లక్షల మంది అనుచరులను సంపాదించడం ఈ గ్రహ స్థానానికి నిదర్శనం. జాతకంలో బుధ-ఆదిత్య సంయోగం అసాధారణమైన భావప్రసార శక్తిని ప్రసాదిస్తుంది. అందుకే ఈ పార్టీ మీమ్స్, రీల్స్, వ్యంగ్యంతో సహా అన్ని రకాల సోషల్ మీడియా భాషలలో ప్రావీణ్యం సంపాదించింది. కుజుడు తన సొంత రాశి అయిన మేషంలో ఉండటం యువతకు ధైర్యాన్ని, భారీ ప్రజా ఉద్యమాలను ప్రారంభించే శక్తిని ఇస్తుంది. శుభవార్త ఏంటంటే, జాతకంలో కాలసర్ప దోషం లేదు, అంటే ఉద్యమం ఉనికికి ఎటువంటి పెద్ద ముప్పు ఉండదు. ఈ పార్టీ కృత్తిక నక్షత్రంలో జన్మించింది, దీని ప్రాథమిక స్వభావం వ్యవస్థను విమర్శించడం , సంస్కరణలను డిమాండ్ చేయడం. ఇదే ఈ పార్టీ ఆత్మ. మే 21న, ఏజబీబి2029 యొక్క ఠ ఖాతాలో 'భారతదేశంలోని చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా, ఖాతా ×చీలో నిలిపివేశారు.. అని చూపించడం ప్రారంభించినప్పుడు, ప్రజలు ఆశ్చర్యపోయారు. జాతకం ప్రకారం, ప్రస్తుత రాహు అంతర్దశ తప్పుడు ఆరోపణలు, నిందలు, పనిలో అడ్డంకులను స్పష్టంగా సూచించింది. పార్టీ పుట్టిన ఐదు రోజులకే ఇది నిజమని తేలింది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, అమావాస్య రోజున మరియు నాగ కరణ కాలంలో జన్మించిన వారు తమ ప్రవర్తన కారణంగా సామాజిక వివాదాలను ఎదుర్కోవచ్చు. దీని అర్థం వ్యవస్థతో సంఘర్షణ అనివార్యం, కానీ ఈ వివాదమే ఈ ఉద్యమాన్ని మరింత పెద్దదిగా చేస్తుంది. జాతకం ఇచ్చే సమాధానం స్పష్టంగా అవుననే, 2029 దీనికి మొదటి పెద్ద పరీక్ష కానుంది. 2028-29లో ఈ జాతకంలో బుధ అంతర్దశ కాలం ప్రారంభమవుతుంది, దీనిని జ్యోతిష్య శాస్త్రంలో కొత్త ప్రయత్నాలలో కచ్చితమైన విజయానికి సూచికగా పరిగణిస్తారు. బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నికలో అభ్యర్థిని నిలబెడుతున్నారన్న ప్రస్తుత వార్త ఈ దిశగా మొదటి అడుగు అవుతుంది. దీని తర్వాత 2030 నుంచి 2040 వరకు చంద్రుని మహాదశ వస్తుంది. ఈ సమయంలో మీ ప్రణాళికలన్నీ పూర్తిగా నెరవేరతాయని జాతకం చెబుతోంది. దీనిని బొద్దింక జనతా పార్టీ యొక్క "స్వర్ణయుగం" అని పిలవవచ్చు. ప్రస్తుతానికి (2026), ప్రభుత్వానికి తక్షణ ఎన్నికల ముప్పు చాలా తక్కువగా ఉంది. అయితే, 2028-29 నాటికి, ఈ పార్టీ ఒక సంఘటిత రాజకీయ శక్తిగా మారి, దేశంలోని 'జెన్-జెడ్' యువత ఓటు బ్యాంకును నేరుగా ప్రభావితం చేస్తుంది. అందుకే కేవలం ఐదు రోజుల వయసున్న ఒక వ్యంగ్య పార్టీ ఖాతాను మూసివేయడం ప్రభుత్వానికి ఎంతో అవసరమనిపించింది. జాతకాలలోని పరాశర రాజ యోగం , అంభయచారి యోగం రెండూ కలిసి, దీర్ఘకాలంలో ఈ పార్టీ అధికారంలో , పరిపాలనలో గణనీయమైన వాటాను కలిగి ఉంటుందని సూచిస్తున్నాయి. ఈ జాతకం ఒక ముఖ్యమైన హెచ్చరికను కూడా అందిస్తోంది. 2027 నుంచి 2029 వరకు, ఈ జాతకం శని సడే సతి ఉదయ దశలో ఉంటుంది. ఈ కాలంలో, ప్రభుత్వం నుంచి చట్టపరమైన , రాజకీయ ఒత్తిడి పెరుగుతుంది, సంస్థలో అంతర్గత విభేదాలు తలెత్తుతాయి , ఆర్థిక సంక్షోభం కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ క్లిష్ట సమయంలో 2029 సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి, ఇవి సీజేపీకి అతిపెద్ద పరీక్షగా నిలుస్తాయి. కానీ కృత్తిక నక్షత్రం ప్రాథమిక స్వభావాన్ని గుర్తుంచుకోండి: వెనుకబడటం లేదా ఓడిపోవడం మీకు భరించరానిది. సోషల్ మీడియా వ్యంగ్యంగా ప్రారంభమైన ఈ పార్టీ, ఇప్పుడు భారత రాజకీయాల్లో , డిజిటల్ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన పేర్లలో ఒకటిగా మారింది. ఈ జ్యోతిష్య వాదనలను నమ్మినా నమ్మకపోయినా, వాస్తవం ఏంటంటే, నిరుద్యోగ యువతను 'బొద్దింకలు' అని అసహ్యించుకునే దేశంలో, అదే జెన్-జెడ్ యువత తమ గుర్తింపు కోసం పోరాడటానికి ముందుకు వస్తారు. మరియు 2030 నుంచి 2040 వరకు ఉన్న దశాబ్దం వారిదేనని ఈ పార్టీ జాతకం గట్టిగా ప్రకటిస్తోంది.

## స్త్రీ శక్తి థీమ్!

**మొదటి పేజీ తరువాయి...**

తెలంగాణకు సంబంధించిన 4 తీర్మానాలు, అండమాన్‌కు సంబంధించిన ఒక తీర్మానం, ఉమ్మడి అంశాలపై 4 తీర్మానాలు, రాజకీయ తీర్మానాలు ఉండనున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పెట్టుబడులు, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మహిళా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, మహిళల భాగస్వామ్యంతో అమలు చేసిన కార్యక్రమాలను మహానాడు వేదికగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మహిళల భాగస్వామ్యంతోనే ప్రతి సంక్షేమ పథకాన్ని రూపొందించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై మహానాడులో సమగ్ర చర్చ జరగాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేలా మహానాడును నిర్వహించాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి రెండు రోజుల ముందే ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అగ్రనాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు అందరినీ మహానాడులో భాగస్వాములను చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహానాడు ప్రారంభానికి ముందు రాష్ట్రంలోని అన్ని క్లస్టర్లలో దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు విగ్రహాలకు నివాళులు అర్పించి కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే ఎన్టీఆర్ సిద్ధాంతాలు, తెలుగుదేశం పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా ప్రత్యేక ప్రజెంటేషన్లు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన రాజకీయ, సామాజిక మార్పులను మహానాడు వేదికగా ప్రదర్శించాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. పొలిట్ బ్యూరో సమావేశంలో వైసీపీపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తున్న 'గొడ్డలి పార్టీ కుట్రలను' మహానాడు వేదికగా ప్రజల ముందుంచాలని నిర్ణయించారు. అలాగే 'నా దేశం-నా బాధ్యత' పేరుతో పొదుపు చర్యలు, సామాజిక బాధ్యతలపై ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నారు.

## 30 మంది మంత్రులు అవుట్..?

**మొదటి పేజీ తరువాయి...**

ఉత్కంఠగా మారింది. ఇక తెలంగాణ బీజేపీలో మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉంది. 2026లో ఇది మొట్టమొదటి కౌన్సిల్ మీటింగ్. కేంద్ర మంత్రులతో పాటు సహాయ మంత్రులు క్యాబినెట్ మీటింగ్ కు హాజరుకావాలని కేంద్రం చెప్పింది. ఈ క్యాబినెట్ భేటీలో అనేక కీలక అంశాలను ఎజెండాగా పెట్టుకుంది కేంద్రం. కేబినెట్ విస్తరణ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులతో భారత్ పై ప్రభావం ఏ విధంగా ఉండబోతోంది, ఏయే రంగాల్లో పొదుపు పాటించాల్సిన అవసరం ఉంది.. ఇటువంటి అంశాలతో పాటు 6 దేశాల పర్యటనలో ఆయా దేశాలతో భారత్ చేసుకున్న ఒప్పందాలపై క్యాబినెట్ లో చర్చించబోతున్నారు. ముఖ్యంగా క్యాబినెట్ రీషఫుల్ కి సంబంధించి అనేక ఊహాగానాలు వస్తున్నాయి. ఈ నెల చివరలో లేదా వచ్చే నెల మొదటి వారంలోనే కేంద్ర క్యాబినెట్ విస్తరణ జరగబోతోందని ఇప్పటికే కొన్ని లీకులు ఇచ్చారు. కేబినెట్ లో ఎవరెవరు ఉండబోతున్నారు, ఎవరెవరు వెళ్లబోతున్నారు అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే మంత్రుల పనితీరుకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో కేంద్రం రిపోర్ట్స్ పరిశీలించినట్లు తెలుస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. తెలంగాణ నుంచి ఒక కేంద్ర మంత్రి, ఒక సహాయ మంత్రి ఉన్నారు. వీరిద్దరని మారుస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. వారి స్థానంలో ఒక మహిళకు (డీకే అరుణకు) మంత్రి పదవి అవకాశం ఇస్తారని సమాచారం. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఇద్దరు సహాయ మంత్రులు, ఒక కేంద్ర మంత్రి ఉన్నారు. ఏపీకి సంబంధించి కూడా కొన్ని మార్పులు జరుగుతాయని సమాచారం. పురంధేశ్వరిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని వార్తలు వస్తున్నాయి. ఇక, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని సమాచారం.




## సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా ఉషశ్రీ ప్రమాణ స్వీకారం

### మూగ బధిరుల పాఠశాలకు 50వేల రూపాయలు విరాళం

**సింహాచలం, మే 21 జయ జయహే**

సింహాచలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలక మండలి సభ్యురాలు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్, క్రీడాకారిణి, జనసేన నాయకురాలు, మాజీ కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ స్వామివారి సేవలో భాగస్వామ్యం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. "మానవ సేవే మాధవ సేవ" అనే నమ్మకంతో గత ఐదేళ్లుగా ప్రజాసేవలో ఉన్నానని, నేడు ఆ అప్పన్న స్వామి ఆశీస్సులతోనే ఈ అద్భుత అవకాశం దక్కిందని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కూటమి అధిష్టానానికి, జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఒక అంతర్జాతీయ క్రీడాకారిణిగా క్రమశిక్షణ, అంకితభావంతో ఎలా రాణించానో... అదే పట్టుదలతో 100 శాతం శ్రమించి ఆలయ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేస్తానని ఉషశ్రీ స్పష్టం చేశారు. ఇది కేవలం పదవి కాదు, ఒక గొప్ప బాధ్యత అని, చైర్మన్ అశోక్ గజపతి రాజు నాయకత్వంలో పాలకమండలి సభ్యులందరూ సమష్టిగా ఆలయ అభివృద్ధికి తోడ్పడతామని హామీ ఇచ్చారు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకుని, దేవస్థానం పరిధిలోని మూగ బధిరుల పాఠశాల అభివృద్ధి కొరకు పెద్దిశెట్టి ఉషశ్రీ తన వంతుగా 50 వేల రూపాయల విరాళాన్ని ప్రకటించి, దానికి సంబంధించిన చెక్కును ఈఓ వెంకట్రావు కి వేదికపైనే అందజేశారు. తనకు ఈ సేవా అవకాశాన్ని ప్రసాదించిన అప్పన్న స్వామికి, పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు.

## కొత్త ప్రభుత్వాల్లో ఏఐ శాఖలు

**మొదటి పేజీ తరువాయి...**

అప్పగించడం ద్వారా యువతకు ,టెక్నాలజీకి పెద్దపీట వేసినట్లయింది. భవిష్యత్తులో ఉద్యోగాల సృష్టి, డేటా సెంటర్లు , స్మార్ట్ గవర్నెన్స్‌లో ఈ శాఖ కీలక పాత్ర పోషించనుంది. కొత్తగా నియమితులైన ఏఐ మంత్రుల ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. తమిళనాడు ఏఐ మంత్రి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా చేరవేయడానికి ఏఐ టూల్స్‌ను ఉపయోగించడం, భాషా అడ్డంకులను తొలగించడానికి తమిళ భాషా ఏఐ మోడల్స్ ను అభివృద్ధి చేయడం ఈ శాఖ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో వినూత్న మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది కేవలం సాంకేతిక శాఖ మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే ఇంజిన్‌గా మారబోతోంది. ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాలు ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. తమిళనాడును ఏఐ హబ్‌గా మార్చడం ద్వారా అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించడం మంత్రి కుమార్ ప్రాథమిక బాధ్యత. ఇప్పటికే చెన్నై ఐటీ రంగానికి నిలయంగా ఉంది, ఇప్పుడు ప్రత్యేక ఏఐ శాఖ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఏఐ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం ద్వారా లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కొత్త అవకాశాలు దక్కే అవకాశం ఉంది. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతారనే ఆందోళనల మధ్య, ఈ మంత్రిత్వ శాఖ మానవ వనరులను రీ-స్కిల్లింగ్ చేయడంపై దృష్టి సారించనుంది. కాలేజీ స్థాయి నుంచే విద్యార్థులకు ఏఐ లో శిక్షణ ఇవ్వడం, నిరుద్యోగులను ఏఐ నిపుణులుగా మార్చడం వంటి కీలక నిర్ణయాలు ఈ శాఖ పరిధిలోకి వస్తాయి. మంత్రి కుమార్ తన బాధ్యతలను ఎలా నిర్వహిస్తారు? ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను తమిళనాడుకు ఎలా అన్వయిస్తారు? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. కేరళ ఇప్పటికే ఏఐ కాన్క్లేవ్‌లు నిర్వహిస్తూ ఈ రంగంలో ముందుండాలని చూస్తోంది. ఇప్పుడు తమిళనాడు కూడా పోటీలోకి రావడంతో దక్షిణాది రాష్ట్రాలు టెక్నాలజీ పరంగా దేశానికే దిక్సూచిగా మారుతున్నాయి. ఏఐ శాఖ ద్వారా పారదర్శకమైన పాలనను అందిస్తూనే, ప్రైవేట్ భాగస్వామ్యంతో సరికొత్త ప్రాజెక్టులకు కుమార్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే మరిన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది.

## విశాఖలో ఎలక్ట్రిక్ రాపిడ్ ట్రాన్సిట్

**మొదటి పేజీ తరువాయి...**

పోలీస్ కె.ప్రవీణ్ కుమార్, పెందుర్తి మండల రెవెన్యూ అధికారి వెంకటరమణ ,స్విట్జర్లాండ్ కు చెందిన హెచ్ ఈ ఎస్ ఎస్ గ్రీన్

మొబిలిటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో కలిసి పెందుర్తి జంక్షన్ వద్ద పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో పెందుర్తి జంక్షన్ నుండి కాన్వెంట్ జంక్షన్ వరకు రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు వాహనాల రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు ఆధునిక ప్రజా రవాణా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ - ఆర్టీ వ్యవస్థపై కార్యాచరణ చేపట్టే దిశగా అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెట్రో తరహా సౌకర్యాలతో కూడిన రోడ్డు ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థను అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ - ఆర్టీ వ్యవస్థ ద్వారా ప్రత్యేక కారిడార్లలో ఎలక్ట్రిక్ బస్సులు వేగవంతంగా, సురక్షితంగా మరియు పర్యావరణ హితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హెచ్ ఈ ఎస్ ఎస్ సంస్థ ప్రతినిధులు ఈ ఆర్టీ వ్యవస్థ ప్రత్యేకతలను వివరించారు. ఈ వ్యవస్థలో అధిక సామర్థ్యంతో కూడిన ఎలక్ట్రిక్ బస్సులు ఒకేసారి 240 మందికి పైగా ప్రయాణికులను తరలించగలవని, రోజుకు సుమారు 23 గంటలపాటు సేవలు అందించగల సామర్థ్యం కలిగి ఉంటాయని తెలిపారు. అదేవిధంగా హెచ్ ఈ ఎస్ ఎస్ సంస్థకు 140 సంవత్సరాలకు పైగా ఇంజనీరింగ్ అనుభవం ఉండటంతో పాటు, యూరప్ మరియు ఆస్ట్రేలియా దేశాల్లో ఈ- ఆర్టీ వ్యవస్థ విజయవంతంగా అమలులో ఉందని వివరించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించడం, కాలుష్య నియంత్రణ, వేగవంతమైన ప్రజా రవాణా సేవలు అందించడం వంటి అంశాల్లో వ్యవస్థ కీలక పాత్ర పోషించనుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ పరిశీలనలో బస్ స్టేషన్ల ఏర్పాటు, ప్రత్యేక మార్గాల అభివృద్ధి, ఎలక్ట్రిక్ బస్సుల రాకపోకలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులు స్థల పరిశీలన నిర్వహించారు. ఈ విషయమై ఆర్టీసీ, ఈపీడీసీఎల్, ట్రాఫిక్ పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, తదితర సంబంధిత శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రధాన ఇంజనీర్ కు కమిషనర్ ఆదేశించారు.

# అచ్చన్న మహా సంకల్పం అభివృద్ధిలో పట్టు మహాదేవి కోనేరు

### 13 కోట్లతో కోనేరు ఆధునీకరణకు సర్కారు శ్రీకారం

### ప్రగతి పథానికి టెక్కలి నియోజకవర్గం సిద్ధం

**టెక్కలి మే 21 జయ జయహే**





మహా సంకల్ప బలంతో ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వశీ సారధ్యంలో టెక్కలి నియోజకవర్గం ప్రగతి పథంలో నడిపించేందుకు స్థానికులు పర్యాటకుల మనసు ఉల్లాసానికి మెరుగులు దిద్దేందుకు మంచి ఆశయం సంకల్పంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ఆదర్శప్రాయమైన టెక్కలి నియోజకవర్గంగా తయారు చేసేందుకు అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజల సమన్వయంతో టెక్కలిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సత్వర శీఘ్ర కృషి జరుగుతుంది. టెక్కలి నడి ఒడ్డున ఉన్న పూర్వం రాజుల కాలం నాడు విరాజిల్లిన పట్టు మహాదేవి కొలను 13 కోట్ల రూపాయల ఖర్చుతో సమగ్ర ఆధునీకరణకు ప్రణాళికలు రూపొందించిన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్న సంకల్పం, తీవ్రమైన కృషి మంచి ఫలితాలను అందిస్తుంది. పట్టు మహాదేవి కోనేరు ప్రాంతం రెండు దశలుగా పచ్చదనం పర్యాటక కేంద్రంగా తయారు కావడానికి సిద్ధమవుతోంది. ఈ పార్క్ మధ్యలో విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు నిలువెత్తు విగ్రహ ప్రతిష్ట జరుగుతుంది, అన్ని వయసుల ప్రజలు నిత్యం ఆహ్లాదాన్ని, ఆరోగ్యం, వాకింగ్, ఉల్లాసంగా గడిపేందుకు అందమైన ఆధునీకరణ , ఆధ్యాత్మికం,ప్రకృతి పరమైన సోయగాలును ఈ పార్కులో నిర్మితమవుతున్నా యి, ఓ చక్కని ప్రజలు మెచ్చిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సత్వర పనులు జరుగుతున్నాయి. తెదేపా అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో టెక్కలి ప్రగతి పురోగమనానికి మంత్రి అచ్చన్న మహా సంకల్పంతో విజయవంతమై టెక్కలి గ్రామము చరిత్ర పుటలలో నిలవాలని పలువురు స్థానికులు అధికారులు, అనధికారులు, పర్యాటకులు, మహిళలు చిన్నారులు, యువత ఆశిస్తున్నారు.

## కుల గణనతో అందరికి న్యాయం...!

### ఆలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పెదిరెడ్ల రాజ శేఖర్

**విశాఖపట్నం, మే 21, జయ జయహే**



కుల గణనతో అందరికీ న్యాయం జరుగుతుందని ఆలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పెదిరెడ్ల రాజ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుల గణనను సమర్ధించిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలోని జరుగుతున్న జనాభా సేకరణలో కుల గణన నిర్వహించడం ఎంతో ఆవశ్యకతని, దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నటువంటి వెనుకబడిన వర్గాలకు లభించవలసిన రిజర్వేషన్ల నిష్పత్తి సక్రమంగా అమలు కాకపోవడంతో అసమానతలు రోజు రోజుకు పెరిగిపోతూ వస్తున్నాయన్నారు. అలాంటి అసమానతులను అరికట్టి అందరికీ సమానమైన న్యాయం జరగాలని, అందరికీ సమాన అవకాశాలు దొరకాలంటేలే వర్గం వారు ఎంతమంది ఉన్నారో సంబంధించిన లెక్కలు పరిగణలోకి తీసుకుంటేనే సంక్షేమ పథకాలను విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాలలో అవకాశాలను ప్రభుత్వాలు అందించే వీలుందని వెల్లడించారు. జనాభా సేకరణలో కుల గణన ఆవశ్యకతను సుప్రీంకోర్టు సమర్థిస్తూ తీర్పుని ఇవ్వడంతో దేశంలోనే బీసీ వర్గాలు అందరిలోనూ హర్షాధిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కొన్ని కులాలు కొన్ని సామాజిక వర్గాలు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా ఒక రాష్ట్రంలో బీసీలుగా కొనసాగితే మరొక రాష్ట్రంలో ఎస్సీలుగా కొనసాగడం, ఎస్టీలుగా కొనసాగడం, ఓసీ లుగా కొనసాగడం వంటి ఎన్నో వ్యత్యాసాలను ఈ యొక్క కుల గణన ద్వారా వాటి పూర్తి వివరాలను తెలుసుకోగలుగుతామని గుర్తు చేశారు. కుల గణనను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయాలని దీంట్లో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా కుల గణనను నిర్వహించలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.



## ఆర్ఐఎన్ఎల్ సీఎండీని కలిసిన జిల్లా కలెక్టర్ కిషోర్

**విశాఖపట్నం, మే 21, జయ జయహే**

జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ గురువారం విశాఖ ఉక్కు కర్మాగారంలో ఆర్ఐ ఎన్ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎన్.వి.ఎస్. ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆరఐఎనఎల్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌కు జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, ఉపాధి అవకాశాలు, స్టీల్‌ప్లాంట్ పరిపాలనా, అభివృద్ధి అంశాలపై ఇరువురూ కాసేపు మాట్లాడుకున్నారు.



## సింహాచల ఆలయ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

### నూతన ధర్మకర్తలకు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు పిలుపు

### - వైభవంగా దేవస్థానం ధర్మకర్మల మండలి ప్రమాణస్వీకారం

**సింహాచలం, మే 21, జయ జయహే :**

శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్మల మండలి (ట్రస్ట్ బోర్డ్) ప్రమాణస్వీకార మహోత్సవం గురువారం కొండపై జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు నూతన సభ్యులచే శాస్త్రోక్తంగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మర్తి, నరసాపురం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆర్. కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ కార్యక్రమానికి వర్చువల్ (ఆన్‌లైన్) ద్వారా హాజరై, నూతన సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం బోర్డు సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రమాణస్వీకారం చేసిన ధర్మకర్మల మండలి సభ్యులు: ధర్మకర్తల మండలి సభ్యులు మాకేన సీతారాం పాత్రుడు (నవీన్), కసిరెడ్డి దామోదర్, చలమూరి భారతి, కరక దేవుడు, కనకాల మురళీమోహన్, వెంపడాపు అన్నపూర్ణ, బీతాల నీరజ లక్ష్మీ కుమారి, మధుపద సన్యాసి రావు, డాక్టర్ ధరణి బండ్ల, నీతిపల్లి మహేష్, పెద్దిశెట్టి ఉష శ్రీ, లలిత జ్యోతి, గుత్తికొండ శ్రీలత, సుసరపు గణపతి రావు, చల్లాంగి జ్ఞానేశ్వరి, పావులూరి శ్రీనివాస రావు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా గూడవర్తి శ్రీనివాస ఆచార్యులు (ఆలయ ప్రధాన అర్చకులు), ప్రత్యేక ఆహ్వానితులుగా బొక్కం స్వామి నాయుడు, వేదుల దక్షిణామూర్తి తదితరులంతా ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధులత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఇతర సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో అధికారులు, సభ్యుల కుటుంబ సభ్యులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# రోజూ 100 కుక్కలకు ఆపరేషన్లు చేయాలి

### ఎ బి సి కేంద్రాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ గార్గ్

**విశాఖపట్నం మే 21, జయ జయహే**



మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిరోజు సుమారు 100 కుక్కలకు ఆపరేషన్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ను ఆదేశించారు. గురువారం ఆయన తూర్పు జోన్ ఆరిలోవ లో గల ఏనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రాన్ని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న అనకాపల్లి, ఆరిలోవ, నరవ, కాపులప్పాడ లో గల నాలుగు ఎ బి సి ( ఏనిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాలలో రోజుకు సుమారు 65 నుండి 70 కుక్కలకు ఆపరేషన్ చేయడం జరుగుతుందని, వీటి సంఖ్యను 100 కు పెంచాలని జీవీఎంసీ కమిషనర్ సిటీ వెటర్నరీ అధికారిని ఆదేశించారు. పట్టుకున్న కుక్కను ఎన్ని రోజులలో డాగ్ సెంటర్లో ఉంచుతారని కమిషనర్ ఆరా తీయగా పట్టుకున్న డాగ్ ను ఒక్కరోజు ఉంచి ఆరోగ్యం గా ఉన్న పిదప ఆపరేషన్ చేసి , ఎడమ చెవికి నాచ్ వేసి మూడు నాలుగు రోజులు పాటు ఉంచి వాటికి ఆహారం రెండు పూటలా పెట్టడం జరుగుతుందని, తదుపరి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేసిన పిదప కుక్కను ఏ ప్రాంతం నుండి తీసుకొచ్చామో అదే ప్రాంతాల్లో వదిలిపెట్టడం జరుగుతుందని కమిషనర్ కు సిటీ వెటర్నరీ అధికారి తెలిపారు. ఆరిలోవ, నరవ సెంటర్లలో మరిన్ని ఆపరేషన్లు చేసేందుకు అవసరమయ్యే చర్యలు తో పాటు స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సెంటర్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి దానిని జీవీఎంసీలోని (సిఓసి) సిటీ ఆపరేషన్ సెంటర్ కు అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. వీధులలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను పట్టుకొని వాటికి ఆహారం, నీరు అందించాలని అలాగే పశువుల యజమానులు నిబంధనల ప్రకారం జరిమానా విధించి వారికి అప్పజెప్పాలన్నారు. పశువుల సంరక్షణార్థం వాటికి అవసరమకు షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేయాలని వాటి నిర్వహణకు సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న జైన్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ వారిని సంప్రదించి తగిన చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ కు కమిషనర్ ఆదేశించారు.నగరంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పశు సంచార నియంత్రణకు చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## వడదెబ్బ లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

గోకవరం మండలం జి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారులు డా. తిరన్, డా. నిఖిత పర్యవేక్షణ లో మండలంలోని ఉపాధి హామీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రదేశాలలో వైద్య సిబ్బంది "వడదెబ్బ లక్షణాలు –తీసుకోవలసిన జాగ్రత్తలు "కోసం అవగాహన కార్యక్రమాలు, ఓ.ఆర్.ఎస్ తయారుచేయు విధానం గురించి డిమాన్ స్ట్రేషన్ చేసి చూపించారు. ఈ సందర్భంగా గోకవరం మండలము లోని వీరలంకపల్లి నందు ఉపాధి హామీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బందికి వైద్య సిబ్బంది పలు సూచనలు ఇచ్చారు. ఈ మే నెలాఖరు వరకు ఎండలు ఎక్కువగా కాస్తాయని అధిక వేడి గాలులు వలన వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలని బయటకు వెళ్ళు నపుడు గొడుగు టోపీ తప్పనిసరి అని తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగాలని, లైట్ కలర్ కాటన్ దుస్తులు ధరించాలని ఖాళీ కడుపుతో ఎండలో తిరగరాదని, తలనొప్పి తలతిరుగుట అలసట అనిపిస్తే నిర్లక్ష్యం చేయరాదని టీ, కాఫీ, కూల్డ్రింక్స్ ఎక్కువ తాగొద్దని వడదెబ్బలక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సమీపంలో నున్న ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం ఓ. ఆర్. ఎస్ ను ఏవిధంగా తయారు చేసుకోవాలనేది ప్రదర్శించి చూపారు. అందరికీ ఓ. ఆర్. ఎస్ పాకెట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమం లో వైద్యసిబ్బంది ఎమ్. ఎల్. హెచ్. పి. అరుణ, హెల్త్ అసిస్టెంట్ లు పవన్, రమణ టి. బి సూపర్వైజర్ శ్రీనివాస్ ఆశాలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కె. రామకృష్ణ 10మంది మేట్స్ సుమారుగా 200వరకు ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.




## భారతీయుల దినచర్యలో "చాయ్"కు ప్రత్యేక స్థానం ఉంది

### చాయ్ ఆత్మీయ కలయికలో వక్తలు

**శ్రీకాకుళం. - ( జయ జయహే )**

ప్రపంచవ్యాప్తంగా తేయాకు ఉత్పత్తిని ప్రోత్సహించడం, కార్మికుల హక్కులను కాపాడటం, టీ కి ఉన్న చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను తెలియజేయడమే, ముఖ్య ఉద్దేశ్యమని, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యుల బృందం, లయన్ నటుకుల.మోహన్, లయన్ పొన్నాడ.రవి కుమార్ అన్నారు. సైక్లింగ్ అనంతరం బృందమంతా ఒక ప్రదేశానికి చేరుకొని, టీ రుచిని ఆస్వాదించి మాట్లాడుతూ భారతీయుల దినచర్యలో చాయ్ కు ప్రత్యేక స్థానం ఉందని, ఉదయం లేవగానే తాగే టీ నుండి, సాయంత్రం అలసట తీర్చే కప్పు వరకు ఇది కోట్లాది మందికి దినచర్యలో బాగామన్నారు. భారతదేశంలో మసాలా చాయ్, హైదరాబాద్ ఇరానీ టీ, అస్సాం టీ, యాలకుల టీ, కాశ్మీరీ కహ్వా వంటి ఎన్నో రకాలు చాలా ప్రసిద్ధి చెందాయని, టీ లో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని, ఇవి ఒత్తిడిని తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయన్నారు. అయితే, పాలు, చక్కెర ఎక్కువగా వాడకుండా మితంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని, చాయ్ ప్రియులతోపాటు, ప్రజలందరికీ ప్రపంచ టీ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. చాయ్ దినోత్సవ కలయికలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సీజు కాపవరపు బృందం పాల్గొన్నారు.




## సిక్కోలు ఐటిడిఏ ఏర్పాటు ఎప్పుడో ?

### గిరిజనాభివృద్ధికి చేయూత నివ్వండి

### సరిహద్దు గ్రామాల్లో తప్పని గిరిజనం ఇక్కట్లు

### కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

**టెక్కలి మే 21 జయ జయహే**

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చి మాటకు కట్టుబడి ఉండాలని తక్షణమే శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఏ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని శ్రీకాకుళం జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు కు ప్రశ్నించారు. సిపిఎం ఆధ్వర్యంలో టెక్కలి మండలం జక్కరపేట లో సిపిఎం మండల కన్వీనర్ కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో ఐటీడీఏ లేకపోవడం గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని గిరిజనుల భూములు స్థానికేతరుల కబ్జాలో ఉన్నాయని ప్రభుత్వ జిల్లా యంత్రాంగం పట్టించుకునే పరిస్థితులు లేవని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనుల పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన తూతూ మంత్రంగా ఉందని, వ్యవసాయ భూములకు సాగునీరు అందించే ప్రయత్నాలు ఏవి లేవని విద్య వైద్య సేవలు సమగ్రంగా అందడం లేదని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని జిల్లా ప్రతినిధులు నంబూరు షణ్ముఖరావు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస అభివృద్ధి కార్యక్రమాలు అలసత్వం వహించడం వల్ల పలువురు గిరిజనులు గ్రామాల నుంచి వలస బాట పడుతున్నారని గిరిజనులు తెలిపారు. గిరిజన ప్రాంతంలో దుర్గం గడ్డపై సరి యా పల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపడుతామన్న ప్రభుత్వం నేటికీ అమలు జరగలేదని సిపిఎం ప్రతినిధులు ర్యాలీలో నిరసనలు వ్యక్తం చేశారు గిరిజన సమస్యలపై ఐటీడీఏ ఏర్పాటు కోసం దశలవారీగా పోరాటం చేస్తామని సిపిఎం ప్రతినిధులు డి గోవిందరావు, షణ్ముఖరావు స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ప్రతినిధులు బగాది వాసుదేవరావు, బొంతు అప్పారావు, బొంతు నరసమ్మ, బొంతు రవి, బొంతు లక్ష్మమ్మ, సీతమ్మ, హరీష్, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాన్ని ఊరేగిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు .



## తెలంగాణ నవ ప్రస్థానలో ఫ్యూచర్ సిటీ

(సి.హెచ్.ప్రతాప్)

హైదరాబాద్ నగర శివార్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీ తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. సుమారు ముప్పై వేల ఎకరాల అపార విస్తీర్ణంలో 765 చదరపు కిలోమీటర్ల మేర విస్తరిస్తున్న ఈ సరికొత్త నగరం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులతో అభివృద్ధి చెందుతోంది. యాభై ఆరు రెవెన్యూ గ్రామాలు, మూడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో విస్తరిస్తున్న ఈ ప్రాజెక్ట్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా రూపుదాల్చుకుంటోంది. రాబోయే కాలంలో ఇరవై ఐదు నుంచి ముప్పై లక్షల మంది జనాభా ఇక్కడ నివసించడానికి వీలుగా అత్యాధునిక సాంకేతికతను జోడించి జీవన విధానాన్ని సులభతరం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఈ నగర నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారు. సౌరశక్తి వినియోగం, వినూత్న జల నిర్వహణ పద్ధతులు, కాలుష్య రహిత రవాణా వ్యవస్థల ద్వారా దీనిని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ నివసించే ప్రజలు తమ నివాస ప్రాంతాలకే పరిమితం కాకుండా ఒకే చోట విద్యాభ్యాసం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఆహ్లాదకరమైన వినోదాన్ని పొందేలా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేశారు. కేవలం నివాస ప్రాంతంగానే కాకుండా పారిశ్రామికంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రత్యేక జోన్లను నిర్మిస్తున్నారు.

ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, జీవ విజ్ఞాన శాస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ, విద్యుత్ వాహనాల పరిశ్రమలు, సమాచార నిల్వ కేంద్రాలు, ఉన్నత విద్యా సంస్థలు, అత్యాధునిక వైద్యశాలలు ఈ నగరంలో కొలువుదీరనున్నాయి. ఈ రకమైన ఆధునిక పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు అత్యున్నత నైపుణ్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. భూములు కోల్పోయిన స్థానిక రైతులకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారికి అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లు కేటాయించేలా మెగా టౌన్‌షిప్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనివల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆర్థిక సమతుల్యత ఏర్పడుతుంది.

ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, వివిధ జాతీయ రహదారులతో అద్భుతమైన రవాణా అనుసంధానం కలిగి ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రధాన బలంగా మారింది. దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఈ రవాణా సౌకర్యాలు ఎంతగానో దోహదపడతాయి. పచ్చదనం పెంపొందించడం, కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు పెద్ద ఎత్తున తోటల పెంపకం చేపడుతున్నారు. భూసేకరణ ప్రక్రియలో స్థానిక ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ, వారి సామాజిక భద్రతకు భరోసా కల్పిస్తూ సమతుల్య విధానాన్ని అనుసరిస్తున్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ స్థిరత్వం, సామాజిక సమగ్రతను ఒకే తాటిపైకి తెస్తూ నిర్మిస్తున్న ఈ భవిష్యత్ నగరం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా భారతదేశ పట్టణ అభివృద్ధి రంగానికి ఒక దిశానిర్దేశం చేసే నమూనాగా నిలుస్తోంది. ఆర్థిక వృద్ధిని, పర్యావరణ పరిరక్షణను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లే ఈ బృహత్తర ప్రాజెక్ట్ రాబోయే తరాలకు ఆదర్శవంతమైన జీవన ప్రమాణాలను అందిస్తుంది.

# భారతీయ సాంస్కృతిక సంస్కర్త , భారత పునరుజ్జీవన పితామహుడు రాజా రామ్మోహన్ రాయ్

**స్త్రీ విద్య - సామాజిక రుగ్మతలను రూపుమాపే దివ్యౌషధంగా భావించిన దార్శనికుడు**

**సతీసహగమనం దురాచారంపై అవిశ్రాంతంగా పోరాడి బ్రిటిష్ వారిచే దీనికి వ్యతిరేకంగా చట్టం చేయించిన మహామహుడు**

**హిందూ సమాజంలో కులతత్వం, బహు దేవతారాధన అస్పృశ్యతకు కారణంగా భావించి ఏకేశ్వరోపాసన ప్రాతిపదికగా బ్రహ్మసమాజం స్థాపించిన మత సంస్కర్త**

**సామాజిక రుగ్మతలకు పరిష్కారాలు చూపి ఆచరించిన ఆదర్శవాది**

**విభిన్న భాషల్లో వారపత్రికలను నడిపి సామాజిక మార్పుకు కృషిచేసిన మహనీయుడు**



ఇంగ్లాండ్‌లోని బ్రిస్టల్‌లో ఉన్న ఆర్నోస్ వేల్ స్మశానవాటికలోని రామ్ మోహన్ రాయ్ సమాధి .



బ్రిస్టల్‌లోని రామ్ మోహన్ రాయ్ విగ్రహం

పంతొమ్మిదవ దశాబ్ది తొలి మూడున్నర దశాబ్దాల కాలంలో రాజా రామ్మోహన్ రాయ్ భారతీయ సమాజంలోని విభిన్న రంగాల్లో విప్లవాత్మక మార్పులకు విశేషంగా కృషిచేసి అనేకాంశాలలో విజయం సాధించి భారత పునరుజ్జీవన పితామహుడుగా పేరుగాంచిన బహుముఖ ప్రజ్ఞాశాలి. బెంగాల్ లోని రాధానగర్లో 254 ఏండ్ల క్రితం 1772 మే 22 న సాంప్రదాయ సంపన్న అగ్రవర్ణ కుటుంబంలో జన్మించిన రామ్మోహన్ రాయ్ చిన్ననాడే సంస్కృత, పర్షియన్, అరబిక్, ఆంగ్ల, బెంగాలీ భాషలలో పాండిత్యం సంపాదించాడు. 1814 వరకు ఈస్ట్ ఇండియా కంపెనీలో అనేక ఉన్నత ఉ ద్యోగాలు చేసి బ్రిటిష్ ప్రభుత్వం భారతీయ సమాజాన్ని అణచివేతకు గురిచేస్తూ, కనీస పౌరహక్కులు కల్పించక, న్యాయ, చట్టబద్ధ పాలన సాగించక ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకున్న ఆయన భారతీయ సాంస్కృతిక, సామాజిక రుగ్మతలను కూడా అధ్యయనం చేసి భారతీయుల ఆలోచనా విధానంలో మార్పులు రావాలని భావించాడు. ప్రాథమిక హక్కులు, చట్టబద్ధ పాలన వంటి అంశాలపై బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాటానికి భారతీయులు విద్యావంతులై బ్రిటిష్ పాలనా రంగంలో భాగస్వాములు కావాలని భావించాడు.

భారతీయ సమాజాభివృద్ధికి ప్రధాన శత్రువులుగా అస్పృశ్యత, మూఢ నమ్మకాలు, కులతత్వం, బహు దేవతారాధన, బాల్య వివాహాలు, బహు భార్యత్వం నుండి విముక్తి లభించాలని, ఈ దిశగా సమాజం చైతన్యవంతమై సామాజిక రుగ్మతలపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శతాబ్దాలుగా వేళ్లూనుకున్న ఆచారాలు, కట్టుబాట్లు, అవిద్య , అసమానతలుపై పోరాటానికి తొలిదశలో సహకరించక పోగా, వ్యతిరేకించినా మొక్కవోని ధైర్యంతో రామ్మోహన్ రాయ్ ముందుకురిమాడు. మద్దతిచ్చేవారి సహకారం తీసుకుని ప్రజలను చైతన్య పరుస్తూ నాటి బ్రిటిష్ ప్రభుత్వ ఉన్నతాధికారుల సహకారం తీసుకుని లక్ష్యసాధన దిశగా అడుగులు వేసాడు.

భార్య చనిపోతే పునః వివాహం చేసుకున్న పురుషుడు, భర్త చనిపోయిన సందర్భంలో మాత్రం భర్త చితి మంటల్లో భార్యను బలవంతంగా పడవేసి భారత్ మరణానికి కారణమైన సతీసహగమనం. ఈ దురాచారం మహిళల జీవించే హక్కును కాలరాస్తుందని, సమాజం చైతన్యవంతమై దీనికి వ్యతిరేకంగా ఏకోన్ముఖంగా పోరాడాలని రామ్మోహన్ రాయ్ పిలుపునిచ్చారు ఓవైపు ప్రజా చైతన్యానికి పోరాటం చేస్తునే అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. రామ్మోహన్ రాయ్ నేతృత్వంలోని ప్రజా ఉద్యమం ఫలితంగా నాటి బ్రిటిష్ ప్రభుత్వ గవర్నర్ జనరల్ లార్డ్ విలియం బెంటింక్ ఆర్టికల్ శుXX ద్వారా సతీసహగమనం దురాచారాన్ని రద్దుచేస్తూ చట్టం చేయడంతో ఓ సామాజిక రుగ్మతకు



తెరపడినట్లయింది. రామ్మోహన్ రాయ్ జీవితంలో దీనిని ఒక ఘన విజయంగా భావించవచ్చు.

బాల్య వివాహాలు అధికశాతం జరిగే నాటి సమాజంలో ఈ దురాచారం పై ఆయన ప్రశ్నించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేసారు. బహు భార్యత్వం పురుషాధిక్య సమాజాన్ని సూచించడమే గాక మహిళలకు స్వేచ్ఛ లేకుండా యాంత్రికంగా తయారుచేసిందని, దీనికి వ్యతిరేకంగా మహిళలు కూడా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రుగ్మతలను రూపుమాపాలంటే బాలికా విద్యను ప్రోత్సహించాలని సూచించారు. ఆయనే స్వయంగా భారతీయ జ్ఞానాన్ని పాశ్చాత్య శాస్త్రాలతో మేలవించి సమగ్ర విద్యాబోధన జరగాలని 1822లో ఆంగ్లో- హిందూ పాఠశాలలను ప్రారంభించి బాలికా విద్యను ప్రోత్సహించారు. 1826 లో ఏకోశ్వరోపాసన సిద్ధాంత ప్రాతిపదికపై వేదాంత కళాశాల ప్రారంభించారు.

రామ్మోహన్ రాయ్ తన ఆలోచనలను, సమాజంలో రావలసిన పెనుమార్పులను బహిరంగ వేదికలపై చర్చించాలని, ఈ ఉద్యమంలో సమకాలీన, భావసారూప్యం గల మేధావులను సంఘటితం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని భావించి 1814లో కలకత్తాలో ఆత్మీయసభ పేరుతో సమావేశం నిర్వహించి సామాజిక రుగ్మతలపై యుద్ధం ప్రకటించారు.

క్రైస్తవ, మహమ్మదీయ మతాల ఏక దేవతారాధనను సమర్ధించిన ఆయన హిందూ మతములో కూడా ఏకోశ్వరోపాసనకు కృషి చేసారు. ఆచారాలు, సాంప్రదాయాల కంటే నైతిక బోధన, ఉన్నత విలువలు గల సమాజం కోసం కృషి చేయాలని, అన్ని మతాలు ఐకమత్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ దిశగా ఆయన హేతువాదం, మానవతావాదం, ఏకోశ్వరోపాస, సమానత్వం తో కూడిన సమాజం కోసం 1828లో బ్రహ్మ సమాజ్ ను స్థాపించారు.

ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజలకు చేరువై సామాజిక మార్పుకై ఆయన బ్రాహ్మణికల్ మేగజైన్, సంవాద్ కౌముది, మీరత్ ఉల్ అక్బర్ వంటి వారపత్రికను నడిపారు.

బహుగ్రంథ రచయితగా పేరొందిన ఆయన అనేక తాత్విక గ్రంథాలు రచించారు, వేద గ్రంథాలను అనువదించారు. సామాజిక, రాజకీయ అంశాలపై పలు వ్యాసాలు రాశారు.

మొఘల్ చక్రవర్తి అనధికార ప్రతినిధిగా ఇంగ్లాండ్ వెళ్లి కింగ్ విలియం శ్రీఎ చే ఘన స్వాగతం పొందారు. 1833 సెప్టెంబర్ 27న ఇంగ్లాండ్ లో బ్రిస్టల్ సమీపంలో స్టేపుల్టన్ లో అనారోగ్యంతో మరణించగా అక్కడే సమాధి చేసారు.

అక్బర్ శ్రీశ్రీ నుండి రాజా బిరుదు పొంది రాజా రామ్మోహన్ రాయ్ గా భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన భారతీయులకు నిత్య స్మరణీయుడు సంస్కరణాభిలాషులకు ఆదర్శనీయులు.



**చౌధరి రాధాకృష్ణ, గాంధేయవాది,**
**జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ**
**అవార్డు గ్రహీత, శ్రీకాకుళం**

# స్వస్తిక్ గుర్తు వెనుక దాగి ఉన్న రహస్యం!

## స్వస్తికి విశిష్టత ఏంటి

(పుట్టా శ్రీనివాసరావు)

**మనం సహజంగా శుభ కార్యాల్లోనూ, దుకాణ సముదాయా ల్లోనూ, నూతన గృహప్రవేశాల్లోనూ, వ్యాపార లావాదేవీల్లోనూ స్వస్తిక్ గుర్తును శుభసూచకంగా వాడుతుంటాం. అయితే ఆ స్వస్తిక్ వెనుక ఉన్న రహస్యం దాని విశిష్టత గురించి ఒకసారి తెలుసుకుందాం.**

సుంఆస్తిక్ = స్వస్తిక్....అంటే మంచి కలుగుగాక.! అసలు ఈ స్వస్తిక్ చిహ్నం విశిష్టత, పుట్టు పూర్వోత్తరాల గురించి తెలుసుకుందాం.! స్వస్తిక్ గుర్తు వెనుక దాగి ఉన్న రహస్యం ఏంటో తెలుసుకుందాం

శుభప్రదం స్వస్తిక్ చిహ్నం. ధార్మిక సందర్భాల్లో చాలా చోట్ల స్వస్తిక్ చిహ్నాలు గీస్తుంటారు. దీనికి శుభసమయాల్లో చాలా ప్రాధాన్యం ఉంది. స్వస్తిక్ అంటే శుభం జరగటం. విశేష సమయాల్లో స్వస్తిక్ చిహ్నం గీయటం వల్ల ఆయా కార్యాలు శుభప్రదంగా విజయవంతం అవుతాయనే విశ్వాసం ఉంది. విఘ్నహర్త అయిన గణేశునికి ప్రతీక అయిన చిహ్నం కనుకనూ, దీన్ని శుభప్రదంగా భావిస్తారు. ఈ స్వస్తిక్ చిహ్నం సూర్యభగవానుని గతిని సూచిస్తుందనీ అంటారు. అందుచేత అది పురాతనకాలంలో సూర్యపూజలకు చిహ్నంగానూ వుండేదట. దీన్ని శ్రీమహాలక్ష్మీదేవికి ప్రతీకగానూ చెబుతారు. దీపావళి రోజున కొత్త ఖాతా పుస్తకాలు ప్రారంభించే వ్యాపారులు, ఈ చిహ్నాన్ని గీస్తారు. తమ వ్యాపారాలకు గణపతి కాపుగా వుండాలనట. దీపావళికే కాకుండా, షష్ఠి పూజల్లోనూ స్వస్తిక్ గీస్తారు. ఉత్తరాదివారి వివాహాలలో, వధూవరుల నుదుట ఈ చిహ్నం వుంటుంది. వారి దాంపత్య జీవితాలు సుఖమయంగా జరగాలనీ, జరుగుతాయనీ సూచన.

భారతీయులు స్వస్తిక్()ను ఎంతో పవిత్రమైందిగా భావిస్తారు. దేశంలో అనేక మతాలకు చెందిన వారు దీన్ని ఆధ్యాత్మికంగా ఉపయోగిస్తారు. సుమారుగా 12వేల ఏళ్ల కిందటి నుంచి స్వస్తిక్ మనుగడలో ఉందని చరిత్రకారులు చెబుతారు. కేవలం మన దేశంలోనే కాదు,అనేక దేశాలకు చెందిన వారు స్వస్తిక్‌ను, దాన్ని పోలిన చిహ్నాలను అనేక వేల సంవత్సరాల నుంచి ఉపయోగిస్తున్నారు. జుడాయిజం, క్రిస్టియానిటీ, ఇస్లాం, బుద్ధిజం, జైనిజంలలో, టిబెట్, చైనా, జపాన్, గ్రీస్, అజ్టెక్, సెయ్లాన్, హోపి, సెల్ట్, బాలి, మాల్టా,



ల్యాప్‌లాండ్ వంటి దేశాల్లో స్వస్తిక్ చిహ్నాన్ని ప్రజలు వాడుతున్నారు.

ఉక్రెయిన్‌లోని మెజిన్ అనే ప్రాంతంలో ఓ ఏనుగు దంతంపై చెక్కబడిన పక్షి బొమ్మలో స్వస్తిక్ చిహ్నాన్ని గుర్తించారు. అది సుమారుగా 13వేల ఏళ్ల కిందటిదని నిర్ధారించారు. సంస్కృతంలో సు అంటే మంచి, శుభం అని అర్థాలు వస్తాయి. అలాగే అస్తి అంటే కలుగు గాక అని అర్థం వస్తుంది. రెండింటినీ కలిపితే సు ం అస్తి = స్వస్తిగా మారుతుంది. అంటే మంచి ఆరోగ్యం లేదా శుభం కలుగుతుంది అని అర్థం అన్నమాట. అందుకనే ఈ చిహ్నం తమకు అన్ని విధాలుగా మంచి చేస్తుందని చెప్పి అనేక మంది దీన్ని వాడడం మొదలు పెట్టారు.

స్వస్తిక్ చిహ్నంలో ఉండే నాలుగు శాఖలు ప్రకృతి పునర్జన్మను సూచిస్తాయి. అంటే జీవుల పుట్టుక, మరణం ఒకదాని తరువాత ఒకటి నిరంతరాయంగా జరుగుతుందని అర్థం. స్వస్తిక్ చుట్టూ వృత్తాన్ని గీస్తే వచ్చే చిహ్నం సూర్యున్ని ప్రతిబింబిస్తుంది. అది కాంతికి జన్మస్థానంగా చెప్పబడుతుంది. అది విశ్వంలో నలువైపులకు వ్యాపిస్తుంది.

స్వస్తిక్‌కు ఉండే నాలుగు రేఖలు నాలుగు దిక్కులను కూడా సూచిస్తాయి. ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర దిక్కులను అవి సూచిస్తాయి. స్వస్తిక్ మధ్యలో ఉండే స్థానం హిందూ దైవం విష్ణువును సూచిస్తుంది. విష్ణువు నాభిలో నుంచి బ్రహ్మ పుట్టాడు. అందువల్ల స్వస్తిక్ మధ్య స్థానం నుంచి విశ్వం ఆవిర్భవించి విస్తరించిందని చెబుతారు. స్వస్తిక్ మధ్య భాగాన్ని దైవానికి ప్రతీక అని భావిస్తారు.

### స్వస్తిక్ లో రేఖల అర్థాలు

స్వస్తిక్ చిహ్నంలో ఒక రేఖను బ్రహ్మదేవుడిగా భావిస్తారు. మరొక రేఖను నాలుగు వేదాలని చెబుతారు. మరొక రేఖను నాలుగు పురుషార్థాలని భావిస్తారు. ఇంకో రేఖను పౌరులు పాటించాల్సిన ఆశ్రమ ధర్మాలని చెబుతారు. వేదాలు నాలుగు -- రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణ వేదం. పురుషార్థాలు కూడా నాలుగు -- ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ఆశ్రమ ధర్మాలు కూడా నాలుగు -- బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ధర్మాలు...

బౌద్ధులు స్వస్తిక్ చిహ్నాన్ని ప్రతిభా పాటవాలకు, నైపుణ్యానికి చిహ్నంగా భావిస్తారు. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, అమెరికా దేశాల్లో స్వస్తిక్ చిహ్నాన్ని ఆధ్యాత్మికతకు చిహ్నంగా ఉపయోగిస్తారు. నౌవాజో అనే ఓ తెగకు చెందిన వారు స్వస్తిక్ చిహ్నాన్ని అనారోగ్యాలను నయం చేసేందుకు నిర్వహించే ముఖ్యమైన కార్యక్రమాల్లో వాడుతారు.

అయితే జర్మన్ నియంత హిట్లర్ కూడా స్వస్తిక్ చిహ్నాన్ని తన నాజీ సైన్యంలో ఉపయోగించాడు. అందువల్ల స్వస్తిక్‌ను చెడు అనుకునే వారు కూడా చాలా మందే ఉన్నారు. మన దేశంలో ఆర్యులు జర్మనీ దేశానికి చెందిన పూర్వీకులు అని హిట్లర్ నమ్మేవాడు. అందుకనే మన దేశంలో ఎక్కువగా ఉపయోగించే స్వస్తిక్ చిహ్నాన్ని హిట్లర్ తన నాజీ సైన్యం చిహ్నంగా ఉపయోగించాడని చెబుతారు. ఇక స్వస్తిక్ చిహ్నాన్ని అనేక రకాలుగా ప్రస్తుతం అనేక మంది వాడుతున్నారు. వాటిల్లో రెండు రకాలు ప్రధానంగా ఉన్నాయి.

ఎడమ వైపుకు తిరిగి ఉండే లేదా ఎడమ చేతి వాటం స్వస్తిక్ చిహ్నం () ఒకటి. కుడి వైపు తిరిగి ఉండే లేదా కుడి చేతి వాటం స్వస్తిక్ చిహ్నం () ఒకటి. కుడి వైపుకు తిరిగి ఉండే స్వస్తిక్ చిహ్నాన్ని చాలా మంది ఉపయోగిస్తారు.

స్వస్తిక్, ఓం, త్రిశూలం అనే మూడింటిని ఇంటి ప్రధాన ద్వారంపై అంటించి పెడితే ఇంట్లోని దుష్టశక్తులు పారిపోతాయి. అయితే స్వస్తిక్ గుర్తులు, పటాలు పాదాలు తాకేలా వుండకూడదు. స్వస్తిక్‌ను డోర్‌కు అతికించడం ద్వారా శుభ ఫలితాలుంటాయి. ఈతిబాధలుండవు. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి. ఇంకా స్వస్తిక్ రంగ వల్లికలు పూజా గదిలో అలంకరించుకుని పూజ చేయడం ద్వారా అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయని ఆధ్యాత్మిక పండితులు సూచిస్తున్నారు.

## భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

(సి.హెచ్.ప్రతాప్)

భూమి సమస్త జీవకోటికి ప్రాణాధారం. మానవ మనుగడకు కావలసిన ఆహారోత్పత్తికి నేల అత్యంత కీలకమైన వనరు. ఆధునిక కాలంలో అధిక దిగుబడుల కోసమనే ఏకైక లక్ష్యంతో అవసరానికి మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను విచ్చలవిడిగా వాడటం వల్ల మట్టి తన సహజత్వాన్ని కోల్పోతోంది. నేల తల్లి ఆరోగ్యం క్షీణిస్తున్న ప్రస్తుత తరుణంలో భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ఎంతో అత్యవసరం. వ్యవసాయ రంగం సుస్థిరంగా సాగాలన్నా, భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ఆహారం లభించాలన్నా మట్టి జీవకళను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత.

వ్యవసాయ విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావలసిన అవసరం ఉంది. రసాయనాల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము వంటి వాటిని భూమిలో కలియదున్నడం వల్ల మట్టికి అపారమైన బలశక్తి లభిస్తుంది. ఒకే రకమైన పంటను పదే పదే వేయడం వల్ల నేలలోని నిర్దేశిత పోషకాలు హరించుకుపోతాయి. ఈ సమస్యను అధిగమించడానికి పంటల మార్పిడి పద్ధతిని కచ్చితంగా పాటించాలి. ఒక పంట తర్వాత మరో పంటగా పప్పుధాన్యాలను సాగు చేయడం వల్ల వాతావరణంలోని నత్రజని వేర్ల ద్వారా మట్టిలో స్థిరపడి నేల సహజ ఉత్పాదకత పెరుగుతుంది.

వర్షపు నీటి ఉధృత ప్రవాహాల వల్ల పొలాల్లోని సారవంతమైన పైపొర కొట్టుకుపోవడం దేశవ్యాప్తంగా పెద్ద సమస్యగా మారింది. దీనిని నివారించడానికి పొలం గట్ల వెంబడి బలమైన చెట్లను, గడ్డిని నాటడం ద్వారా నేలకోతను సమర్థవంతంగా అడ్డుకోవచ్చు. కొండ ప్రాంతాల్లో నిలువుగా కాకుండా అడ్డంగా దున్నడం, మెట్ల పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా మట్టి కొట్టుకుపోకుండా రక్షించుకోవచ్చు. సూక్ష్మపోషకాల లోపాన్ని శాస్త్రీయంగా గుర్తించేందుకు వీలుగా ప్రతి రైతు తమ పొలంలో ప్రతి మూడేళ్లకు ఒకసారి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. ఆ నివేదికల ఆధారంగానే నేలకు ఏ పోషకం ఎంత కావాలో అంతే మోతాదులో అందించాలి.

పంట కోతల అనంతరం మిగిలే వ్యర్థాలను తగులబెట్టే అలవాటు నేలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. వ్యర్థాలను కాల్చడం వల్ల మట్టిలోని మిత్రపురుగులు, సూక్ష్మజీవులు నశించిపోతాయి. వాటిని భూమిలోనే కుళ్ళింపజేయడం ద్వారా సేంద్రియ కర్బన శాతాన్ని అద్భుతంగా పెంపొందించవచ్చు. అధికంగా నీరు పెట్టడం, సరైన నీటి పారుదల సౌకర్యాలు లేకపోవడం వల్ల భూములు చౌడుబారుతున్నాయి. చౌడు నేలల పునరుద్ధరణకు జిప్సం వంటి పదార్థాలను ఉపయోగించి, శాస్త్రీయ నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలి. బిందు, సూక్ష్మ నీటి సేద్యం ద్వారా భూమి చౌడుబారకుండా కాపాడుకోవచ్చు. భూసారాన్ని రక్షించుకున్నప్పుడే స్థిరమైన దిగుబడులు, నాణ్యమైన పంటలు సాధ్యమవుతాయి. నేలను సజీవంగా ఉంచడమే రాబోయే తరాలకు మనమిచ్చే నిజమైన సంపద.

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సాంప్రదాయ పద్ధతులను సమన్వయం చేసుకోవాలి. మట్టి నాణ్యతను కాపాడటానికి ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను, శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. భూగర్భ జలాల మితిమీరిన వాడకాన్ని తగ్గించి, వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలి. భూసార రక్షణ కేవలం ఒక నినాదంగా కాకుండా ప్రతి ఒక్కరి ఆచరణాత్మక కర్తవ్యంగా మారినప్పుడే దేశంలో శాశ్వత ఆహార భద్రత సిద్ధిస్తుంది.

# నక్కపల్లిలో మత్స్యకారుల సేవలో కార్యక్రమం







### ముఖ్యఅతిథిగా

### హోం మంత్రి వంగలపూడి అనిత

**నక్కపల్లి, మే 21:-(జయ జయహే)**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో మంత్రి నివాసం వద్ద నిర్వహించిన మత్స్యకారుల సేవలో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్. రాయవరం మండలాలకు చెందిన పెద్ద సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేట నిషేధ భృతి చెక్కులను లబ్ధిదారులకు హోం మంత్రి అందజేశారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మత్స్యకారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హోం మంత్రి అనిత, మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.పాయకరావుపేట నియోజకవర్గంలో 18 మత్స్యకార గ్రామాలు ఉన్నాయని, మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. వేట నిషేధ భృతి డబ్బులు బటన్ నొక్కిన గంటలోపే మత్స్యకారుల ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారులతో కలిసి భోజనం చేసి, వారి సమస్యలను తెలుసుకొని మమేకమయ్యారని చెప్పారు. మత్స్యకారుల జీవన విధానాన్ని మార్చేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గానికి రెండు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు మత్స్యకార గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని, ఇప్పుడు మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వంలో ఆ గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని పేర్కొన్నారు. త్వరలో పాయకరావుపేట నియోజకవర్గంలో స్కిల్ ఉ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. మత్స్యకారులకు సబ్సిడీపై ఇంజిన్లు, వలలు, జీపీఎస్ పరికరాలు అందిస్తున్నామని, ఎండు చేపల ఎగుమతులపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని హోం మంత్రి అనిత వెల్లడించారు



## మహిళలు, చిన్నారుల భద్రతపై పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం...

### ప్రజల భద్రతే మా ప్రధాన బాధ్యత" -- ఏఎస్ఐ గంగాధరరావు....

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో, నిడదవోలు సీఐ తిలక్ సూచనలతో నిడదవోలు సర్కిల్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో మహిళలు మరియు చిన్నారుల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నిడదవోలు గణపతి సెంటర్‌లోని రాజు కరాటే ట్రైనింగ్ అకాడమీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు, మహిళా కానిస్టేబుల్ శాంతి పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సైబర్ నేరాల బారిన పడిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్, ఫ్రాడ్ యాప్స్, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు వివరించారు.అలాగే చిన్నారుల భద్రతలో భాగంగా "గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్" గురించి పిల్లలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరణ ఇచ్చారు. మహిళలు మరియు బాలికల రక్షణ కోసం రూపొందించిన "శక్తి యాప్" ఉపయోగాలు, అత్యవసర సమయాల్లో ఎలా వినియోగించుకోవాలో ప్రదర్శనతో వివరించారు.ఈ కార్యక్రమంలో రాజు కరాటే ట్రైనింగ్ సెంటర్ మాస్టర్ మరియు సుమారు 40 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు పోలీసుల సూచనలను ఆసక్తిగా విని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, చిన్నారులపై దాడులను అరికట్టేందుకు కృషి చేస్తోందని అధికారులు తెలిపారు

## అల్లూరు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా శ్రీనాదు

**పాడేరు మే 21 జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అల్లూరు సీతారామరాజు జిల్లాకి పాడేరు నుంచి జిల్లా అధ్యక్షులుగా శ్రీనాథ్ శ్రీను ని నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కోఆర్డినేటర్ కారుమూరి మహేష్ గురువారం తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీను నీ మహేష్ తదితరులు అభినందించారు.




## హెచ్ పీవీ వ్యాక్సిన్ ఆడబిడ్డలకు వరం

### హెచ్ పీవీ వ్యాక్సినేషన్ ను ప్రారంభించిన మాజీ ఎంపీ సీతారామలక్ష్మి

**భీమవరం : (జయ జయహే )**

గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఆడ బిడ్డలకు వరమని రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పెద అమిరంలోని మిత్ర హాస్పిటల్లో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2వ బ్యాచ్ లో మరో 50 మందికి మొదటి విడత హెచ్ పివీ వాక్సినేషన్ వేసే కార్యక్రమాన్ని మాజీ ఎంపీ సీతారామలక్ష్మి ప్రారంభించారు. సీతారామలక్ష్మి మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ను బాల్య దశలోనే అడ్డుకోవడానికి హెచ్ పీవీ వ్యాక్సిన్ అనే బృహత్తర కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొండా రాంబాబు మాట్లాడుతూ మా క్లబ్ ద్వారా 300 మందికి వ్యాక్సిన్ చేయిస్తామని, ఇది ప్రైవేట్ గా వేయించుకుంటే ఒక్కొక్కరికి రూ 12 వేలు అవుతుందని, లయన్స్ క్లబ్ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. డా సాయిబాబా చుందూరి, డా చుందూరి మల్లేశ్వరి, డా చుందూరి విక్రాంత్, డా చుందూరి ప్రియాంక మాట్లాడుతూ 15 సం రాలు వయసు పైబడిన వారికి మన జిల్లాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాక్సినేషన్ చేస్తారన్నారు. ఈ వ్యాక్సినేషన్లో ముందుగా వ్యాక్సిన్ తీసుకోవడంతో పాటు బూస్టర్ డోసు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డా ఐశ్వర్య,అల్లు తులసి ప్రసాద్,గోపిశెట్టి మురళీ, నందమూరి రాజేష్,ఆరవ ప్రసాద్, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్గా మోహన్ రావు

**మాడుగుల మే 21 జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మాడుగుల మండలం సత్యవరం గ్రామానికి చెందిన పుట్టా మోహనరావు ను నియమించినట్టు అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు యలమర్తి నర్సింగరావు గురువారం తెలిపారు. ఈయన రెండేళ్ల పాటు పదవిలో ఉంటారు. ప్రస్తుతం ఆర్యవైశ్య మహాసభ పిఆర్వోగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ఈయన్ని అభినందించారు.

# డ్రగ్స్ వద్దు... ఆటలే ముద్దు

### అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం, మే 21, జయ జయహే**






శంఖబ్రత సంకల్పం కొనసాగింపుగా మహారాణిపేట సిఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు దూరంగా ఉండి క్రీడలను ప్రోత్సహించాలని యువతకు పిలుపునిస్తూ నిర్వహించిన "డ్రగ్స్ వద్దు -- ఆటలే ముద్దు" అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని యువతకు మార్గదర్శనం చేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, విద్యార్థులు మరియు యువత సానుకూల దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా 450 మందికి క్రీడాకారులకు క్రికెట్ కిట్లను, 102 మంది వాలీబాల్ ప్లేయర్స్ కు వాలీబాల్ కిట్లను, 30 మంది యువతులకు రింగులను, 250 మంది పేద మహిళలకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, మహిళలు 1000 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువజన ప్రతినిధులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## దళిత హక్కులను కాలరాసిన జగన్

**విశాఖపట్నం, మే 21:( జయ జయహే)**

జగన్మోహన్ రెడ్డి పాలనలో దళితుల హక్కులను యధేచ్చగా కాలరాశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. డాక్టర్ సుధాకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో గురువారం పోస్టర్ ను ప్రదర్శించారు. కోవిడ్ సమయంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ ఉద్యోగం నుంచి తొలగించి చనిపోయేవరకూ వేధించారన్నారు. దళితులను అణగదొక్కే వైసీపీని ప్రజలు తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, కె.రామానాయుడు, తాత్రాజు అప్పారావు, సూరాల సత్య వరప్రసాద్, దేవుళ్లు, కాకర రమణ, ఎన్ని వెంకట్రావు, నరసింగరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.




## మూగజీవులకు దాహ నివారణ సేవ

**విశాఖపట్నం /ఉక్కునగరం( జయ జయహే)**

తీవ్రమైన ఎండల నేపథ్యంలో మూగజీవుల పట్ల కరుణాభావంతో ఉక్కునగరం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు విశిష్ట సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉక్కునగరం సెక్టార్-2లోని శ్రీ సత్యసాయి మందిరం బయట ప్రతిరోజూ కుండల్లో స్వచ్ఛమైన తాగునీటిని ఏర్పాటు చేసి ఆవులు, గేదెలు, కుక్కపిల్లలు తదితర మూగజీవుల దాహాన్ని తీర్చుతున్నారు.అలాగే, మండుతున్న వేసవి వేడిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రజలకు చల్లని తాగునీరు అందిస్తూ సేవలందిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంటోంది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన పశువులు ఈ నీటిని తాగుతూ ఉపశమనం పొందుతున్న దృశ్యాలు అందరినీ కదిలిస్తున్నాయి. "మానవ సేవే మాధవ సేవ" అనే భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ సమితి సభ్యులు ఈ సేవను నిరంతరం కొనసాగిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసిస్తూ, మూగజీవుల పట్ల ప్రేమాభిమానాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని కోరుతున్నారు.



## వాతావరణం అధిక వేడిమి కారణంగా జాగ్రత్తగా ఉండాలి

### తహసీల్దార్ కె ఎస్ జోజీ హెచ్చరిక

**జంగారెడ్డిగూడెం, జయ జయహే**

భారత వాతావరణ శాఖ( ఐ ఎం డి )హెచ్చరికల మేరకు నేటి నుండి 24 వతేదీ వరకు అధిక ఉష్ణోగ్రతలు వడగాల్పులు సంభవించే అవకాశమున్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక మండల తహసీల్దార్ ఎస్ జోజీ సూచించారు.వడగాల్పుల ప్రభావం నుండి రక్షణ పొందేందుకు ప్రజలు మధ్యాహ్న సమయంలో అవసరం లేకుండా బయట తిరగకుండా ఉండాలని ఒక ప్రకటన లో హెచ్చరిక చేశారు.ప్రతి వారు తగినంత నీరు, ఓ ఆర్ ఎస్ మజ్జిగ, నిమ్మరసం, గంజి నీరు వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తప్పనిసరిగా . బయటకు వెళ్లే సమయంలో తలకు గుడ్డ కట్టుకోవడం, పలుచని నూలు దుస్తులు ధరించడం మంచిదని సూచించారు.గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇతర ప్రజా ప్రదేశాలలో తాగునీటి సౌకర్యాలు అందుబాటులో ఉంచేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. వడ దెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యశాలకు తరలించి చికిత్స అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కాగా అందరు గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాలలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని తహసీల్దార్ ఆదేశించారు.

## అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో ఘనంగా కంబాల దంపతుల పెళ్లి రోజు వేడుకలు

**గోకవరం జయ జయహే ప్రతినిధి**



విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, భార్య పద్మావతి దేవి గంగారత్నం దంపతుల పెళ్లి రోజు వేడుకలు రామసేన సభ్యులు, సిబ్బంది, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగాయి అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో గురువారం కంబాల శ్రీనివాసరావు దంపతులు స్వామివారి వ్రతాన్ని ఆచరించారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంబాల దంపతులకు వేద పండితులు ఆశీర్వాదాలు అందించారు

# లోకేష్ చొరవతో అంతర్జాతీయ స్థాయికి ఏపీ విద్యా వ్యవస్థ





### - నక్కపల్లిలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం

### - టాపర్స్‌కు నగదు బహుమతులు అందజేసిన హోంమంత్రి అనిత

**నక్కపల్లి, మే 21, జయ జయహే**

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 103 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున సొంత నిధుల నుంచి నగదు బహుమతులు అందజేశారు. నగదు బహుమతితో పాటు సాలువా, మెమొంటో, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను కూడా ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకురావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చాయని తెలిపారు. పిల్లల పెంపకంలో ఆడ, మగ తేడా చూపకూడదని, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల కొందరు విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, ప్రతి విద్యార్థికి ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని తెలిపారు. యువత కూడా రాజకీయాల్లోకి రావాలని హోంమంత్రి పిలుపునిచ్చారు



## 25 నుంచి జీవీఎంసీ వేసవి క్రీడా శిబిరాలు

**విశాఖపట్నం, మే 21, జయ జయహే**

జీ.వీ .ఎం.సీ .ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి జూన్ 6వరకు నిర్వహించనున్న వేసవి క్రీడా శిబిరాలకు సంబంధించి గురువారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ లోగోను(టీ షర్టును) ఆవిష్కరించారు. జీవీఎంసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఐ .వెంకటేశ్వరరావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, ప్రతి ఏటా జీవీఎంసీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా ఈనెల 25 నుండి జూన్6 వరకు 12 రోజుల పాటు జీవీఎంసీ పరిధిలో 480 శిబిరాలను నిర్వహించ నునట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరాల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 12000 మంది క్రీడాకారులు పాల్గొన ను న్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ నల్లనయ్య, అధికారులతో పాటు వివిధ క్రీడా విభాగాల కు కోచ్లుపాల్గొన్నారు.



## ఎండ... ప్రచండం..!

### రోళ్లు పగిలేలా ఉష్ణోగ్రతలు.. నిప్పుల కొలిమిలా రాష్ట్రం

### పిడుగురాళ్లలో 48.1 డిగ్రీలు.. 18 జిల్లాల్లో 45 దాటిన తీవ్రత

**(అమరావతి - జయజయహే)**

సమ్మర్ హీట్ నెక్స్ట్ లెవెల్‌కి చేరింది. బయటకొచ్చారా.. మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు సూర్యుడు. ఎండల ధాటికి తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిప్పుల కొలిమిలా మారిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోళ్లు, రాళ్లు పగిలే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు నరకం చూస్తున్నారు. రానున్న వారం రోజులపాటు ఇలానే ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అత్యవసరం అయితే ఇళ్ల నుంచిబయటకు రావొద్దని సూచిస్తున్నారు. వచ్చే వారం రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రికార్డు స్థాయిలో పెరుగుతుందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు అలర్ట్ జారీ చేశారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం వరకు ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. గురువారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో గరిష్ఠ ఉష్ణోగ్రత 48.1 డిగ్రీలు నమోదైందని, 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకుగాను 20 జిల్లాల పరిధిలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా పల్నాడు జిల్లాలో 26, ప్రకాశం 23, కృష్ణా 22, ఏలూరు 21, బాపట్ల 20, ఎన్టీఆర్ 15, గుంటూరు 14, మార్కాపురం 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందని పేర్కొన్నారు. అలాగే శుక్రవారం 15 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 219 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.



## లక్ష్మీ కుమారికి అభినందనలు తెలిపిన దొన్ను దొర సతీమణి శాంతి

**పాడేరు/అరకు: జయ జయహే.**

శ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం(సింహాచలం )నూతన ధర్మకర్త మండలి సభ్యులుగా బేతలా నీరజా లక్ష్మి కుమారి గురువారం సింహాచలం దేవస్థానం వద్ద ప్రమాణ స్వీకారం చేశారు. నూతన ధర్మకర్త మండలి తో ఆలయ ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ధర్మకర్త (చైర్మన్) గోవా గవర్నర్ పూసపాటి అశోక గజపతిరాజు వర్చువల్ పద్ధతిలో నూతన ట్రస్ట్ బోర్డు కు పలు సూచనలు చేశారు. అనంతరం నూతన ధర్మకర్త మండలి ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ సియ్యారి దొన్ను దొర సతీమణి శాంతి నీరజ లక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలిపారు. లక్ష్మినరసింహస్వామి భక్తులకు నిబద్ధత తో సేవలందించాలని ఈ సందర్భంగా నీరజ ను కోరారు . నీరజ లక్ష్మి తో పాటు మరో ఎనిమిది మంది నూతన ట్రస్ట్ బోర్డ్ సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు.

## మా కాలనీలకు కరెంటు ట్రాన్స్ఫర్ల లు వేయించండి

**గోకవరం జయ జయహే ప్రతినిధి**



జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం గోకవరం గ్రామంలో సంజీవనగర్, ఎలకల దిబ్బ, డ్రైవర్ కాలనీ, ఈ ఏరియాలో నెల రోజు నుంచి కూడా కరెంటు విపరీతముగా తీయడం జరుగుతుంది. ఈ కాలనీలలో నివసించే వృద్ధులు, చిన్నారులు, చదువుకునే విద్యార్థులు చాలా ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు విద్యుత్ శాఖ అధికారులు, నాయకులు ఈ కాలనీలలో లో వోల్టేజ్ సమస్య లేకుండా, ట్రాన్స్ఫార్మర్లు పెంచి కరెంటు పోకుండా ఉండేలా చేయాలని ఈకాలనీవాసులందరూ ఏఈని అలాగే శాసనసభ్యులైన జ్యోతుల నెహ్రూ ని ఎంపీ ని కోరడం జరుగుతుంది



## జనసేన నాయకుడు గంగులయ్య రాజేంద్రపాలెం పర్యటన

**కొయ్యూరు :(జయ జయహే )న్యూస్, మే 22**

అరుకు-పాడేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వంపూరు గంగులయ్య మే 23 న కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం రానున్నట్లు తెలిపారు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు ఏ విధంగా వివరించాలి అనే అంశంపై చర్చ మరియు పంచాయతీ ఎన్నికల్లో ముందుకు సాగాల్సిన వ్యూహం, కార్యాచరణపై జనసైనికులకు దిశానిర్దేశం. క్షేత్రస్థాయి కార్యకర్తల నుండి సలహాలు, సూచనలు స్వీకరణ జరుగుతుంది అన్నారు రాజేంద్రపాలెం గిరిజన భవనం లో ఉదయం 11:00 గంటలకు ఈ సమావేశం నర్వహించనున్నారు.. కొయ్యూరు మండలంలోని 33 పంచాయతీలకు చెందిన జనసైనికులు, ఉద్యమ సాధక్ సభ్యులు, వీర మహిళలు, పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ముఖ్య నాయకులు అందరూ తప్పక హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణ్,గౌరవ అధ్యక్షులు సాగిన బుజ్జి బాబు, ప్రధాన కార్యదర్శి గూడెపు శేషుబాబు , మహిళా మండల అధ్యక్షురాలు సెగ్గె భావన సాయి జయంతి, మండల ఆర్గనైజర్ పిటా సుధీర్, మండల ఉపాధ్యక్షుడు పొట్టిక రాంప్రసాద్, రావణపెల్లి పంచాయతీ యువ నాయకుడు . సిద్దు, బాకులూరు పంచాయతీ అధ్యక్షుడు కూడా నవీన్, సీనియర్ నాయకుడు బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.



## చోడవరం పుష్కరిణి అభివృద్ధికి పలువురు విరాళాలు

**చోడవరం మే 21 జయ జయహే**

చోడవరం శ్రీ స్వయంభు గారు ఈశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన పుష్కరిణి అభివృద్ధి పనులకు పలువురు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎం ఎస్ రాజు పుష్కరణ కరపత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా దాతలు ఈ విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా షుగర్స్ మాజీ చైర్మన్ జి మల్లు నాయుడు లక్ష రూపాయలు, గోల్కొండ గణేష్ లక్ష రూపాయలు, గూనూరు కనకమహాలక్ష్మి 50 వేల రూపాయలు, సకురుకోటి 50 వేల రూపాయలు, చీపురుపల్లి సూర్యనారాయణ 40,000 రూపాయలు విరాళంగా అందజేశారు వారిని ఎమ్మెల్యే రాజు,ఆలయ కమిటీ చైర్మన్ జి సురేష్ , ధర్మకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవకులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు

# బైతినిలంకలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

**పెదబయలు/అరకు: జయ జయహే.**



యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి, వారి ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అరకు నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి వంతల రామన్న గ్రామ పెద్దలు అన్నారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీ బైతినిలంక గ్రామంలో గ్రామస్తుల సహకారంతో మే 21, 22, 23 తేదీలలో నిర్వహించే మూడు రోజుల జిల్లా స్థాయి సమ్మర్ వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వాన్ని ఇవ్వడమే కాకుండా యువతలో క్రమశిక్షణ, ఐక్యమత్యం, మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలను కెరీర్‌గా మలచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. టోర్నమెంట్ ముఖ్య వివరాలు:ఎంట్రీ ఫీజు: రూ. 400/- మాత్రమేమొదటి బహుమతి: రూ. 20,000/- రెండవ బహుమతి: రూ. 10,000/-మూడవ బహుమతి: రూ. 5,000/-ముగింపు వేడుక: మే 23న ఫైనల్ మ్యాచ్‌లు, ముఖ్య అతిథులచే బహుమతుల ప్రదానం.సంప్రదించాల్సిన నంబర్లు: 7569432005, 8688074681 జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత తమ టీమ్ పేర్లను నమోదు చేసుకుని నేరుగా టోర్నమెంట్‌లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వంతల చిట్టిబాబు మాస్టర్ .ఆదివాసి జేఏసీ నాయకులు, జీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మణుగూరు బాబుజీ, మాజీ సర్పంచ్ వంతల చిన్నారావు, ఎంపీటీసీ రామారావు, బీజేపీ మండల అధ్యక్షుడు కొండపల్లి రాంబాబు, కొర్ర మాధవ రావు, ఆనందరావు, రమణ, బాబూరావు, బాలకృష్ణ, స్థానిక యువత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కోకుమ్ జ్యూస్ లో రోగనిరోధక శక్తి

## ఉసిరి జ్యూస్ లో పోషకాలు



**వేసవి వేడి ఎక్కువగా పెరుగుతున్న సమయంలో ప్రజలు శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరిచే పానీయాలను ఎక్కువగా తీసుకుంటూఉంటారు.వేస విలోబ యట మార్కెట్ లో లభించే శీతల పానీయాలకు బదులుగా సంప్రదాయ జ్యూస్ లను తీసుకోవడం మంచిది. వేసవిలో తీసుకోదగిన సహజ పానీయాల్లో కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ లు ముందు వరుసలో ఉంటాయని చెప్పవచ్చు. ప్రజలు కూడా వేసవిలో కోకుమ్ జ్యూస్, ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఈ సంప్రదాయ సూపర్‌ఫుడ్స్‌తో తయారయ్యే ఈ జ్యూసులు శరీరానికి లోపల నుంచి చల్లదనం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. కోకుమ్ పండ్లు, మొత్తం ఉసిరి కాయలు పోషకాలను అధికంగా కలిగి ఉంటాయి.**

### తాజా జ్యూస్‌లను తీసుకోవడం శ్రేయస్కరం..

అయితే ప్రస్తుతం మార్కెట్లో సిరప్స్, పౌడర్ రూపంలో లభిస్తున్న జ్యూసులతో పోలిస్తే తాజా కోల్డ్–ప్రెస్డ్ జ్యూస్ లను తీసుకోవడం ఎక్కువ ప్రయోజనకరమని వైద్యులు చెబుతున్నారు. రెడీమేడ్ జ్యూసుల్లో కృత్రిమ రంగులు, రుచులు, రసాయనాలు ఉండే అవకాశం ఉంది. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను తగ్గించవచ్చని కనుక తాజా జ్యూస్ లనే తీసుకునే ప్రయత్నం చేయాలని చెబుతున్నారు. అసలు వేసవిలో జ్యూస్ లు ఎందుకు తీసుకోవాలి.. కోకుమ్, ఉసిరి జ్యూస్‌లలోఏది శరీరానికి మేలు చేస్తుంది.. వంటి విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణవ్యవస్థ నెమ్మదిస్తుంది. అందుకే ఆహారాన్ని తక్కువగా తీసుకుంటారు. ఈ సమయంలో కోకుమ్ లేదా ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను తీసుకోవడం వల్ల శరీరానికి నీరు అందుతుంది. అవసరమైన పోషకాలు లభిస్తాయి. శరీరం లోపల నుంచి చల్ల గా ఉంటుంది.

### కోకుమ్ జ్యూస్‌తో కలిగే లాభాలు..

ఇక కోకుమ్ జ్యూస్ ను కోకుమ్ పండుతో తయారు చేస్తారు. దీనిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే దీనిలో ఆంథోసైనిన్లు వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇందులో గార్సినాల్ కూడా ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను, శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అలాగే దీనిలో హైడ్రాక్సీసిట్రిక్ యాసిడ్ వంటి ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరచడంలో దోహదపడతాయి. అలాగే కొద్ది మొత్తంలో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఇందులో ఉంటాయి. కోకుమ్ జ్యూస్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. వేసవిలో వచ్చే అలసటను తగ్గిస్తుంది.

### ఉసిరికాయ జ్యూస్ అయితే..

ఉసిరి జ్యూస్ కూడా పోషకాలను కలిగి ఉంటుంది. మార్కెట్లో లభించే ప్యాక్డ్ జ్యూసుల్లో ఆమ్లా శాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి లేబుల్ చూసి తీసుకోవడం మంచిది. తాజా ఆమ్లా జ్యూస్‌లో విటమిన్ సి 600–700 mg వరకు ఉంటుంది. అలాగే పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ బలమైన యాంటీ ఆక్సిడెంట్ చర్యను అందిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఈ జ్యూస్ లో ఉండే అమినో యాసిడ్లు శరీర జీవక్రియకు మద్దతును ఇస్తాయి. ఉసిరి జ్యూస్ లో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు మద్దతును ఇస్తుంది. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి కనుక రోజూ తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఉసిరి జ్యూస్ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి శక్తినిస్తుంది.

### దేన్ని తీసుకోవాలి..

కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ రెండూ కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని బాగా చల్లబరుస్తుంది. వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. జీరా, ఉప్పు కలిపి ఈ జ్యూస్ ను తీసుకోవడం ఇంకా ప్రయోజనకరంగా ఉంటుంది. అదే విధంగా ఆమ్లా జ్యూస్ శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది.

మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని చల్లగా ఉంచడంలో కొంచెం ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆమ్లా జ్యూస్ మొత్తం ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. ఈ రెండు జ్యూసులు కూడా ఆరోగ్యానికి మంచివే. ఏ జ్యూస్ తీసుకోవాలన్నది సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.



# అల్ట్రా ప్రాసెస్ ఫుడ్ వల్ల అనర్థాలు

**అతిగా ప్రాసెస్ చేసిన ఆహారపదార్థాలు పిల్లల్లో మానసిక రుగ్మతలకు కారణం అవుతున్నాయి. తాజాగా, కెనడాలోని టొరంటో విశ్వ విద్యాలయానికి చెందిన పరిశోధకులు.. అల్ట్రా ప్రాసెస్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలపై ఓ పరిశోధన నిర్వహించారు.**

అతిగా ప్రాసెస్ చేసిన ఆహారపదార్థాలు పిల్ల ల్లో మానసిక రుగ్మతలకు కారణం అవుతున్నాయి. తాజాగా, కెనడాలోని టొరంటో విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు.. అల్ట్రా ప్రాసెస్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలపై ఓ పరిశోధన నిర్వహించారు. ఇందులో భాగంగా 2,000 కంటే ఎక్కువ మంది పిల్ల లను పరిశీలించారు. వారి ఆహారపు అలవాట్లు , అనారోగ్య సమస్యలను క్షుణ్నంగా విశ్లే షించారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ ఎక్కువగా తీసుకునే ఐదేళ్ల లలోపు చిన్నారుల్లో ఆందోళన, భయం, దూకుడు లాంటివి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో చక్కెర, ఉప్పు, అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా, మెదడు ఎదుగుదలకు అవసరమైన ఫైబర్, విటమిన్లు , ఖనిజాలు తక్కువగా ఉంటాయి. వీటి తయారీలో ఉపయోగించే కృత్రిమ రంగులు, ప్రిజర్వేటివ్స్, ఫ్లేవర్లు .. పిల్ల ల నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయట. వీటిలోని అధిక చక్కెర వల్ల రక్తంలో గ్లూకోజ్‌స్థాయిలు అకస్మాత్తుగా పెరగడం, తగ్గడం వల్ల .. పిల్ల ల్లో చిరాకు, ఏకాగ్రత లోపిస్తుంది. వీటిలో వాడే కృత్రిమ రంగులు కూడా ఏడీహెచ్‌డీ వంటి హైపర్ ఆక్టివిటీ లక్షణాలను ప్రేరేపిస్తాయి. కాబట్టి, పిల్ల ల మెదడు అభివృద్ధి చెందే దశలో అతిగా ప్రాసెస్ చేసిన ఆహారపదార్థాలు తీసుకోవడం ఏమాత్రం మంచిదికాదని పరిశోధకులు ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నారు.

# గుండె ఆరోగ్యానికి.. పిస్తా పప్పు



**రోజు గుప్పెడు పిస్తా పప్పును స్నాక్స్‌గా తింటే ఎన్నో ఉపయోగాలు చాలా మంది ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన గింజల్లో పిస్తా పప్పు ఒకటి. వీటిలో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి ముఖ్యమైన పోషకాలు అనేకం ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో, ఎక్కువ సమయం ఆకలి కాకుండా చేయడంలో పిస్తా పప్పు ఎంతో సహాయపడుతుంది.**

చాలా మంది ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన గింజల్లో పిస్తా పప్పు ఒకటి. వీటిలో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు , యాంటీ ఆక్సిడెంట్లు వంటి ముఖ్యమైన పోషకాలు అనేకం ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో, ఎక్కువ సమయం ఆకలి కాకుండా చేయడంలో పిస్తా పప్పు ఎంతో సహాయపడుతుంది. రాత్రి సమయంలో స్నాక్స్ గా తినడానికి పిస్తా పప్పు చాలా చక్కగా ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పిస్తా పప్పు తృప్తి కలిగించే ఆహారమని వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని అయితే వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది కనుక వీటిని మితంగా తీసుకోవాలని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే పిస్తా పప్పును తీసుకోవడం వల్ల కలిగే కొన్ని ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### గుండె ఆరోగ్యానికి..

పిస్తా మొక్క ఆధారిత ప్రోటీన్ కు మంచి మూలం. సుమారు 28 గ్రాముల పిస్తా పప్పులో 6 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. శాకాహారులకు పిస్తా ప్రోటీన్ కు మంచి మూలమని చెప్పవచ్చు. అలాగే వీటిలో శరీరానికి అవసరమయ్యే తొమ్మిది రకాల అమైనో ఆమ్లా లు కూడా ఉంటాయి. వీటిలో మెగ్నీషియం కూడా మంచి పరిమాణంలో ఉంటుంది. గుండె స్పందనను నియంత్రించడంలో, కండరాలకు విశ్రాంతి ఇవ్వడంలో, నరాల పనితీరును మెరుగుపరచడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. అలాగే నిద్రించే ముందు వీటిని తీసుకోవడం వల్ల వీటిలో ఉండే మెగ్నీషియం కారణంగా మంచి నిద్రను సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా పిస్తాను తీసుకోవడం వల్ల కండరాల నొప్పులు కూడా తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. పిస్తాలను స్కిన్నీ నట్స్ అని కూడా పిలుస్తారు. ఎందుకనగా ఇతర గింజలతో పోలిస్తే వీటిలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. వాల్‌నట్స్, మకాడామియా వంటి నట్స్ తో పోలిస్తే అదే క్యాలరీలతో వీటిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవచ్చు.

### బరువు తగ్గేందుకు..

పిస్తాలో ఉండే ఫైబర్ వల్ల ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. దీంతో బరువు కూడా తగ్గవచ్చు. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో కూడా ఇవి సహాయపడతాయి. పిస్తాలో ల్యూటిన్, జియాక్సాంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వయసు పెరగడం వల్ల వచ్చే కంటి సమస్యల నుండి రక్షించడంలో దోహదపడతాయి. పిస్తాను తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరిగి రక్తహీనత తగ్గుతుంది. వీటిలో జింక్, విటమిన్ ఇ వంటి పోషకాలు ఉంటాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇవి సహాయపడతాయి. చర్మ సంరక్షణలో కూడా పిస్తా దోహదపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి.

### ఎంత మోతాదులో తినాలంటే..

ఇలా అనేక రకాలుగా పిస్తా పప్పు ఆరోగ్యానికి మేలు చేస్తుందని, రాత్రి సమయంలో స్నాక్స్ గా తినడానికి ఇవి ఎంతో చక్కగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు. అయితే వీటిని రోజుకు 10 నుండి 12 పప్పుల మోతాదులో మాత్రమే తీసుకోవాలి. వీటిని అతిగా తీసుకోవడం వల్ల బరువు పెరగడం, అజీర్ణం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఉప్పు లేని పిస్తా పప్పులను తీసుకోవడం మంచిది. ఉప్పు ఉన్న పిస్తా పప్పు రక్తపోటు ఉన్న వారికి అంత మంచిది కాదు. అలాగే వీటిలో ఆక్సలైట్స్ ఉంటాయి కనుక మూత్రపిండాల్లో రాళ్లు ఉన్న వారు వీటిని మితంగా తీసుకోవడం మంచిది. పిస్తా పప్పును రోజు వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని అనేక పోషకాలు అందుతాయని వీటిని క్రమం తప్పకుండా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆహారాలు

నేటి తరుణంలో గుండె జబ్బుల బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతుందని చెప్పవచ్చు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు , ఒత్తిడి, ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వంటి వివిధ కారణాల వల్ల గుండె జబ్బుల బారిన పడే వారు ఎక్కువవుతున్నారు. దీంతో గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యల బారిన పడడంతో పాటు ప్రాణాలను కూడా కోల్పోయే పరిస్థితి నెలకొంది. కనుక గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో చాలా మంది తీసుకునే ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుంది. సరైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు గుండె జబ్బులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుంది.

సాల్మన్, మాకేరెల్, సార్డిన్ వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మంటను తగ్గించి ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఆరోగ్యకరమైన గుండె లయకు కూడా ఇవి తోడ్పడతాయి. ఓట్స్ కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. పాలకూర, కాలే వంటి వాటితో పాటు ఇతర ఆకుకూరలను తీసుకోవడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది. వీటిలో విటమిన్లు , ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్త పోటును తగ్గించి ధమనుల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. అదే విధంగా బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలు వంటి వాటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. వీటిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు వాపును తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో తోడ్పడతాయి. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ వంటి వాటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

For a pure tomorrow.. జయహో

# డ్రాగన్ గ్లింప్స్ రిలీజ్



దర్శకుడు ప్రశాంత్ నీల్, తారక్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట టైటిట్ చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ పవర్‌ఫుల్ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఎన్టీ ఆర్‌పుట్టి నరోజు కానుకగా ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్‌టైటిల్ ను ఖరారు చేశారు. మే 19 అర్ధరాత్రి తారక బర్త్‌డేకి కొన్ని నిమిషాల ముందే విడుదలైన ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.ప్రశాంత్ నీల్ తన మార్క్ డార్క్ థీమ్‌తో ఏకంగా 4 నిమిషాల 28 సెకండ్ల నిడివితో ఒక భారీ విజువల్ వండర్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ గ్లింప్స్ వీడియో 1967 నాటి అంతర్జాతీయ ఓపియం బ్యాకడ్రాప్‌లో, గోల్డె న్ట్రయాంగిల్ నేపథ్యంలో సాగే ఒక క్రూరమైన, హింసాత్మకమైన చీకటి ప్రపంచాన్ని కళ్లకు కట్టి ంది. ఇందులో హీరోయిన్ రుక్మిణి వసంత్‌వాయిస్ ఓవర్‌తో కథా నేపథ్యాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ చివరగా అసలైన 'డెవిల్'ను ఎంట్రీ చేయించారు. అఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీకి 'చీఫ్ అసస్సిన్' (ప్రధాన హంతకుడు) అయిన 'లూగర్'అనే అత్యంత భయంకరమైన పాత్రలో ఎన్టీ ఆర్ లుక మైండ్‌బ్లోయింగ్‌గా ఉంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీ ఆర్‌రఫ్ అండ్ లీన్ లుక, గంభీరమైన కళ్లు అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఒక సీన్ లో శవాల దిబ్బపై నిలబడి ఎన్టీ ఆర్‌చెప్పే డైలాగ్ థియేటర్లలో విసిల్ వర్తీగా నిలవడం ఖాయం. 'దేవుడు నాకో గొప్ప వరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మర్చిపోవడం' అంటూ తారక బేస్ వాయిస్‌తో చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రశాంత్ నీల్ సృష్టి ంచిన ఈ సరికొత్త ప్రపంచంలో ఎన్టీ ఆక్యారెక్ట రైజేషన్ మునుపెన్నడూ చూడని విధంగా, ఒక ఊరమాస్ బీస్ట్ మోడ్లో ఉంది. ఈ భారీ యాక్షన్ డ్రామాలో బాలీవుడ్ ఎవర్ గ్రీన్ స్టా ర్అనిల్ కపూర్ ఇండియన్ నార్కోటిక్స బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్'గా ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తుండగా, బిజు మీనన్, ఖుష్బూ సుందర్, అశుతోష్ రాణా, గురు సోమసుందరం, రాజీవ్ కనకాల వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రవి బస్రూర్ అందించిన బ్యాకగ్రౌండ్ స్కోర్ మరియు భువన్ గౌడ విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట లెవెల్‌కు తీసుకెళ్లాయి.





## బాలకృష్ణ మూవీలో మంచు మనోజ్

'వీర సింహారెడ్డి' వంటి బ్లాకబేస్ట ర్ విజయం తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటుడు మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న దర్శకుడు, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, థియేటర్లలో ఆ మ్యాజికనుప్రేక్షకులు ఎప్పుడు చూస్తారా అని తాను ఎంతగానో ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. కాగా ఈ సినిమాలో మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ బ్జడెట్ మూవీలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. ఇందులో బాలయ్య సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జైసింహా' వంటి ఘన విజయాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం ఇది కావడంతో ఈ జంట మరోసారి బాక్సాఫీస్ వద్ద మేజిక రిపీట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. వృద్ధి సినిమాస్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

## ఓటీటీలోకి సతీ లీలావతి

మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల వివాహం తర్వాత వెండితెరపై నటించిన సరికొత్త రొమాంటిక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం సతీ లీలావతి. మలయాళ నటుడు దేవ్ మోహన్‌హీరోగా, 'భీమిలి కబడ్డీ జట్టు'వంటి చిత్రాల ఫేమ్ డైరెక్టర్ తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో, థియేట్రికల్ రన్ చాలా త్వరగానే ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఎవరూ ఊహించని విధంగా కేవలం 12 రోజుల వ్యవధిలోనే ఈ సినిమాను ఓటీటీ వేదికగా డిజిటల్ స్ట్రీమింగ్‌లోకి తీసుకువచ్చింది. మెగా ఫ్యామిలీకి చెందిన ఒక నటి నటించిన సినిమా ఇంత తక్కువసమయంలో ఓటీటీ బాట పట్టడం టాలీవుడ్‌లో ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు 'సన్ నెక్స్ట తో పాటు జియో హాట్‌స్టార్‌లు ఈ చిత్ర డిజిటల్‌హక్కులను సొంతం చేసుకోగా, మే 20 నుంచే తెలుగుతో పాటు తమిళ భాషల్లోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది.ఈ సినిమా కథ విషయానికి వస్తే కథలో లీలావతి (లావణ్య త్రిపాఠి) ఒక స్టార్ డైరెక్టర్. చిన్నతనం నుంచి తల్లిదండ్రుల గొడవల వల్ల కొన్ని మానసిక భయాలతో పెరుగుతున్న ఆమెకు సైకాలజిస్ట్ రామ్ సేతు (దేవ్‌మోహన్ ) అండగా నిలబడి ఆ భయాల నుండి బయటపడేస్తాడు. ఈ క్రమంలోనే ఇద్దరూ ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటారు. అయితే పెళ్లైన మూడేళ్ల తర్వాత, తాను వేరే అమ్మాయి (మడోన్నా సెబాస్టియన్)తో ప్రేమలో ఉన్నానని, తనకు విడాకులు కావాలని రామ్ సేతు భార్యను కోరతాడు. దీంతో షాకకు గురైన లీలావతి భర్తను ఇంట్లోనే బంధిస్తుంది. ఆ తర్వాత వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయి, అసలు సేతు బ్యాకగ్రౌండ్ ఏంటి, చివరికి ఈ జంట ఎలా ఒకటయ్యారు అనేదే ఈ సినిమా ముఖ్య కథాంశం.

## దురంధర్-2పై హైకోర్టు లో వ్యాజ్యం

బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించిన 'ధురంధర్ 2' కు ఇప్పుడు ఓ చిక్కు ఎదురైంది. ఈ సినిమాలో సాయుధ దళాల కార్యకలాపాల వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. సశస్త్ర సీమా బల్ లో హెడ్ కానిస్టే బుల్‌గా పనిచేస్తున్న దీపక కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ సినిమా కల్పిత కథ కావచ్చని, కానీ భద్రతాదళ సిబ్బంది లేవనెత్తిన ఆందోళనలనూ విస్మరించలేమని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టి ఫికేషన్‌ని ఆదేశించింది. ఈ సినిమా స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చిలో విడుదలై, రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. విదేశాల్లో ఇప్పటికే 'నెట్‌ఫ్లిక్స'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ.. భారత్‌లో జూన్ 5 నుంచి ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది. జూన్ 4న రాత్రి 7గంటలకు డిజిటల్‌ప్రీమియర్ ఉండనుంది.



Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com